ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

జూన్ 2009
వెల : రూ. 10

జగన్నాథః స్వామీ నయనపథగామీ భవతు మే ।

సుబోధ

ఒక్కొక్కప్పుడు సిద్ధులవల్ల గొప్ప అనర్థాలు వాటిల్లుతాయి. ఒక గొప్పసిద్ధుడి గురించి తోతాపురి నాతో ఇలా చెప్పాడు: "ఒకమారు ఆ సిద్ధుడు సముద్రతీరంలో కూర్చుని ఉండగా పెద్ద తుపాను చెలరేగింది. 'తుపాను ఆగిపోవుగాక!' అని ఆ సిద్ధుడు అనగానే తుపాను ఆగిపోయింది. సరిగ్గా ఆ సమయంలోనే పూర్తిగా విప్పిన తెరచాపలతో అమిత వేగంగా సముద్రంలో ఒక ఓడ పోతోంది. హఠాత్తుగా గాలి స్తంభించిపోవటంతో ఆ తాకిడికి ఓడ మునిగిపోయి, అందులోని వారంతా సముద్రం పాలైనారు. అంతమందికి ప్రాణహాని కలిగించిన పాపం సోకటంతో ఆ సిద్ధుడు తన సిద్ధులనన్నిటినీ కోల్పోవటమే కాకుండా నరకానికి కూడా వెళ్ళి పాపఫలం అనుభవించవలసి వచ్చింది".

నేను పంచవటి కింద సాధనలు చేసే కాలంలో గిరిజుడు అనే వ్యక్తి అక్కడికి వచ్చాడు. అతడు గొప్పయోగి. ఒక రాత్రి చీకట్లో నేను నా గదికి వెళ్ళాల్సి వచ్చింది. అప్పుడతడు తన చేతిని పైకెత్తగా అతడి బాహుమూలం నుంచి గొప్ప వెలుగు వెలువడి మార్గాన్ని ప్రకాశవంతం చేసింది. నా హితవు విని ఆ మహిమను వినియోగించటం మానేసి అతడు బ్రహ్మసాక్షాత్కారానికై మనస్సు మరల్చుకొన్నాడు. కొన్నాళ్ళకు అతడికి ఆ శక్తిపోయినా ఆత్మోన్నతిని పొందగలిగాడు.

మహారాజుల అంతఃపురాలకు వెళ్ళగలిగే యాచకుడు గుమ్మడి కాయ, పుచ్చకాయవంటి అల్ప వస్తువుల కోసం యాచిస్తే చాలా తెలివితక్కువగా ప్రవర్తించినవాడవుతాడు. రాజరాజేశ్వరుడైన సర్వేశ్వరుడి ద్వారంవద్ద నిలబడి, అమూల్యమైన భక్తి జ్ఞానాలను విడిచి, సిద్ధుల కోసం అర్థించే భక్తుడు అవివేకంగా వర్తించిన వాడవుతాడు. ❖

('శ్రీరామకృష్ణ బోధామృతం' నుంచి)

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029
ఫోన్: 040-2766 7799, 2763 3936
E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

1888 నవంబరులో మాతృదేవి పూరీ జగన్నాథ యాత్ర చేశారు. ఆమెతో రాఖాల్, యోగీన్, శరత్, యోగీన్‌మా, గోలాప్‌మా, లక్ష్మి ప్రభృతులు వెళ్ళారు. మాతృదేవి గురుదేవుల పటాన్ని తమతో పాటు తీసుకెళ్ళారు. ఆలయానికి వెళ్ళి పూజించినప్పుడు, గురుదేవుల పటాన్ని బయటకు తీసి వారికి కూడా స్వామి దర్శనం చేయించారు. అక్కడ తమకు కలిగిన దివ్యదర్శనం గురించి మాతృదేవి ఇలా చెప్పారు: “వజ్ర వైడూర్యాలతో పొదిగిన సింహాసనంపై పురుష సింహంలాగ” ఆసీనులై ఉన్నారు జగన్నాథస్వామి. నేను ఒక సేవకురాలిగా సపర్యలు చేస్తున్నాను”.

వందలాది భక్తులు అక్కడికి వచ్చి జగన్నాథుని దర్శించుకునే దృశ్యం మాతృదేవిని చకితురాలిని చేసింది. “ఆహా! ఏం అద్భుతం! వీరంతా ముక్తి పొందుతారు కదా!” అన్నారు ఆనందబాష్పాలు స్రవిస్తూండగా. కానీ మరుక్షణమే, “ఎక్కడికి వెళ్ళి ఆరాధనలు చేసినా వాసనారహితులు మాత్రమే ముక్తి పొందగలుగుతారు” అని ఆమెకు తెలియజేయబడింది.

తమ దివ్య దర్శనంలో మాతృదేవి జగన్నాథుణ్ణి శివుని రూపంలో చూశారు. ఒక లక్ష సాలగ్రామ శిలలతో నిర్మింపబడిన పీఠం మీద పరమశివుడు లింగ స్వరూపంలో కొలువైవుండడం చూశాను అన్నారామె.

మాతృదేవికి కలిగిన ఈ దర్శనం, ఆ దేవాలయ స్థల పురాణంతో సరిపోతుంది.

పూరీలో మాతృదేవి దేవాలయానికి వెళ్ళి రావడానికి పల్లకీ ఏర్పాటు చేయమని ఆలయ పూజారి చెప్పాడు. అందుకు మాతృదేవి వినమ్రంగా “వద్దు, మీరు దారి చూపుతూ ముందు వెళ్ళండి. నేను మీ వెనుక వస్తాను” అని ఒక సామాన్యురాలిలాగ చెప్పారు. పూరీ జగన్నాథంలోని ఇతర ఆలయాలకు కూడా వెళ్ళి దర్శనం చేసుకున్నారు. మహాలక్ష్మి సన్నిధిలో చాలాసేపు ధ్యానంలో లయించిపోయారు. పూరీ జగన్నాథ యాత్ర మాతృదేవి మనస్సుకు ఎంతో ఆహ్లాదం కలిగించింది. ❖

(‘శ్రీ శారదాదేవి చరితామృతం’ నుంచి)

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు ‘శ్రీరామకృష్ణ ప్రభ’ మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 66 సంచిక: 6 జూన్ 2009

న వై యాచే రాజ్యం న చ కనకమాణిక్య విభవం
న యాచేఽహం రమ్యాం సకల జనకామ్యాం వరవధూమ్।
సదా కాలే కాలే ప్రమథపతినా గీతచరితో
జగన్నాథః స్వామీ నయనపథగామీ భవతు మే ॥

ఓ జగన్నాథ స్వామీ! నాకు రాజ్యం గానీ, ధన సంపదలు గానీ, భోగాలు గానీ వద్దు. నిత్యం ఆ పరమశివునిచేత కీర్తింపబడే నువ్వు నిరంతరం నా దృష్టిపథంలో ఉండేలా అనుగ్రహించు!

(శ్రీ జగన్నాథాష్టకమ్)

లోపలి పేజీల్లో...

4 సంపాదకీయం
మన జీవనయాత్రే ఓ రథయాత్ర!

10 దేవీ వైభవం

6 గోరుముద్ద
నైతికత

12 మనోవికారాలకు అతీత స్థితి

7 జగన్నాథుడే శ్రీరామకృష్ణులు

13 ధీరవాణి
ఓ సోదరులారా! కార్యశూరులుకండి!!

8 జన్మరాహిత్యాన్నిచ్చే జగన్నాథుడు

14 పరిప్రశ్న

9 పరమేశ్వరుని పరిరక్షణలో...
పునర్జన్మను ప్రసాదించిన పుణ్యదంపతులు

15 ఆచారవ్యవహారాలు – అంతరార్థాలు
సకల శుభకరం శంఖం

శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు	చిరునామా	రూ.
రాజ పోషకులు	: శ్రీ వి. చంటి, శాంతినగర్, ఏలూరు - 534 007		5,000
పోషకులు	: శ్రీమతి కె. శారద, మెహిదీపట్నం, హైదరాబాద్ - 500 028		2,000
" "	: శ్రీ ఎమ్. వెంకటస్వామి, ఆనంద్‌నగర్ కాలనీ, హైదరాబాద్ - 500 004		1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ./డి.డి./చెక్కు రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను.

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో
స్వామి జ్ఞానదానంద
అధ్యక్షులు

ముఖచిత్రం : పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రం పూరీలో వెలసిన జగన్నాథ స్వామి ఆలయం. ఈ ఆలయాన్ని కళింగ దేశ రాజు అనంతవర్మ చోడగంగదేవ 12వ శతాబ్దంలో నిర్మించాడు. ప్రధాన ఆలయ గోపురం ఎత్తు 192 అడుగులు. జగన్నాథస్వామి మూర్తిని దారువు (కర్ర)తో రూపొందించడం వల్ల ఇక్కడ స్వామిని 'దారు బ్రహ్మ' అని పిలుస్తారు.

ADVERTISEMENT TARIFF

	MULTI COLOUR	B & W
Fourth Cover	Rs.25,000	-
Second Cover	Rs.20,000	-
Third Cover	Rs.20,000	-
Inside Full Page	Rs.15,000	10,000
Inside Half Page	Rs.10,000	5,000

చందా వివరాలు		ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి	:	రూ. 10	-
ఒక సంవత్సర చందా	:	రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

లోపలి పేజీల్లో...

16 **బొమ్మల కథ**
సుబ్రహ్మణ్యస్వామి లీలా విలాసం

26
స్వామి వివేకానందుని దృష్టిలో ఆదర్శ విద్యార్థి

18
స్వతంత్రులమవుదాం!

28
చదవండి... చదివించండి!

20 **ఓ మహాత్యాగి ఆత్మకథ**
(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

29 **ముందుకు సాగిపో!**

22 **ప్రాచీన గాథలు : జీవన వికాసం**
ప్రయత్నమంతా ప్రశాంతత కోసమేనా!

33 **నా జీవితంలో స్వామి వివేకానంద**
మాటలు కావు... అవి మహామంత్రాలు!

24 **యువవాణి**
నవతరం సందేహాలకు సమాధానాలు

34 **మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు**
సమయస్ఫూర్తి

25 **మనసు-మర్మం**
పవిత్ర ఆలోచనలతో మనోనిర్మలత!

35
వ్యక్తిత్వ వికాసం

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకి కుడి భాగంలో మీ చందా గడువు నెల పొందుపరచబడి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకొని, 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ చేయబడుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకుడు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.

- సంపాదకులు

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

మన జీవనయాత్రే ఓ రథయాత్ర !

రథయాత్ర అనగానే అందరికీ ఠక్కున గుర్తుకు వచ్చేది పూరీజగన్నాథ రథయాత్ర. ప్రతీ సంవత్సరమూ అత్యంత వైభవంగా జరిగే ఈ రథయాత్రలో దేశం నలుమూలల నుంచీ అసంఖ్యాక భక్తులు పాల్గొంటారు. అత్యద్భుతంగా అలంకరించిన రథంలో దివ్యమూర్తుల విగ్రహాల్ని ప్రతిష్ఠించి నృత్యగానాలతో పురవీథుల్లో ఊరేగిస్తారు. భక్తులు ఆనందపారవశ్యంతో రథయాత్రను తిలకిస్తారు. ఫల పుష్పాదులను అర్పించి, భక్తి ప్రపత్తులతో రథం ముందు ప్రణమిల్లుతారు. రథానికి వేలాది మంది భక్తులు తమ శిరస్సులు వంచి ప్రణతులర్పించడానికి కారణం అందులో భగవంతుని దివ్య మూర్తులు కొలువుతీరి ఉండడం అని మనకు విదితమే. సంవత్సరానికి ఒకసారి జరిగే ఈ రథయాత్రకు ఇంత ప్రాముఖ్యం ఉంటే, మరి మన జీవన యాత్రలో నిత్యం జరిగే రథయాత్రకు మరెంత ప్రాముఖ్యత ఉండాలి? అయితే మన జీవన యాత్ర కొనసాగించేందుకు ఉపయోగించే రథం ఏది? ఆ రథంలో ఆసీనుడై ఉన్న రథికుడెవరు?

పశుప్రవృత్తి నుంచి పశుపతి స్థితికి చేర్చే వాహనం :

బాహ్య ప్రపంచంలో గమ్యాన్ని చేరుకోవడానికి ఎన్నో రకాల వాహనాలు ఉన్నాయి. కానీ అంతర ప్రపంచంలో పయనించి పరమపదాన్ని చేరుకోవడానికి మనకున్న ఒకే ఒక వాహనం ఈ 'శరీరం'. శరీరం అనే రథంలో ఆసీనుడై ఉన్న రథికుడు చైతన్య స్వరూపుడైన భగవంతుడు(ఆత్మ).

రథం యొక్క బాహ్యాలంకారాల్ని తిలకిస్తూ రథికుణ్ణి మరిచిపోతే అలాంటి రథయాత్ర నిష్ప్రయోజనం. అలాగే మనం దేహాలంకారాల్లోనూ, దేహసౌందర్య ఆకర్షణల్లోనూ మునిగి దేహాంతర్గతంగా ఉన్న ఆత్మ స్వరూపాన్ని ఆదమరచిన నాడు మన జీవనయాత్ర నిరర్థకం.

ఆత్మ సాక్షాత్కార యాత్రలో మనిషిని పశుప్రవృత్తి నుంచి పశుపతి స్థితికి చేర్చే ఏకైక సాధనం ఈ మానవ దేహం. ఎన్నో జన్మల సుకృత ఫలమైన ఈ మానవ దేహమనే రథాన్ని బాహ్య విషయాలవైపు పరుగులు తీయనీయకుండా అంతర్ముఖంగా ప్రయాణం కొనసాగించి అంతరాత్మను చేరుకోవడానికి ప్రయత్నించినప్పుడు మానవ జన్మ సార్థకమవుతుంది.

దేహంలో కొలువై ఉన్న దైవం : మన దేహంలో ఉన్న ఆత్మశక్తి కారణంగానే మనసు, బుద్ధి, ఇంద్రియాలు చైతన్యవంతమై కర్మలను ఆచరిస్తున్నాయి. ఆ ఆత్మ చైతన్యమే లేకపోతే దేహం నిర్వీర్యం, నిస్తేజం అవుతుంది.

It is strength and strength that we want and the first step in getting the strength is to uphold the upanishads and believe that 'I am the Atman'.

- Swami Vivekananda

'నేను ఆత్మస్వరూపుడను' అని మనిషి నిజ తత్త్వాన్ని ప్రతిబోధిస్తున్న ఉపనిషత్తుల వ్యాక్యాలయందు విశ్వాసం కలిగిన నాడు మనలో దేహభ్రాంతి పోయి ఆత్మశక్తి జనిస్తుంది. అయితే దేహంలో దేహి ఎలా ఉంటాడు? ఎక్కడ ఉంటాడు?

అంగుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి ।
ఈశానో భూత భవ్యస్య న తతో విజుగుప్సతే ॥

(కఠోపనిషత్తు– 2.i.12)

'బొటన వేలి పరిమాణంలో పురుషుడు ఈ శరీరంలో నివసిస్తున్నాడు. భూత భవిష్యత్తులకు ఆయనే అధిపతి. ఈ ఆత్మను తెలుసుకొన్నవాడు భయం చెందడు'.

సర్వవ్యాపకాలకూ ప్రభువు ఆ భగవంతుడే అనీ, ఈ దేహాన్ని నడిపిస్తున్నది ఆ దైవమే అనీ గ్రహించినప్పుడు దేహమే దేవాలయం అవుతుంది. భగవంతుని సన్నిధిలోనే మనం ఉన్నామని భావించినప్పుడు ఇంక భయానికి చోటెక్కడిది?

ఆత్మానందానికి అంతర్ముఖ యానం : అరుదైన మానవ దేహమనే రథం సహాయంతో ఆత్మ సాక్షాత్కారాన్ని ఎలా పొందవచ్చో కఠోపనిషత్తు వివరిస్తుంది.

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥
ఇంద్రియాణి హయానాహుర్విషయాంస్తేషు గోచరాన్...

(కఠోపనిషత్తు– 1.iii.3,4)

శరీరం – రథం; ఇంద్రియాలు – గుర్రాలు; ఇంద్రియ విషయాలు – మార్గం; మనసు – కళ్ళెం; బుద్ధి – సారథి; ఆత్మ – రథికుడు.

శరీరం అనే రథానికి ఇంద్రియాలే గుర్రాలు. గమ్యస్థానానికి చేర్చేందుకు రథానికి గుర్రాలు ఎంత ముఖ్యమో మన గమ్యస్థానమైన మోక్ష స్థానానికి చేర్చడానికి ఇంద్రియాలూ అంతే ముఖ్యం. గుర్రాలకు చంచలత్వం ఎంత సహజమో ఇంద్రియాలకు కూడా చంచలత్వం అంతే సహజం. అదుపులో లేని గుర్రాలు రథికుణ్ణి గమ్యానికి సురక్షితంగా చేర్చలేవు. అధీనంలో లేని ఇంద్రియాలు కూడా మనిషిని పరమపదానికి చేర్చలేవు. కాబట్టి సారథి కళ్ళాన్ని పట్టుకొని నేర్పుతో గుర్రాలను సవ్యమైన మార్గంలో నడిపించినప్పుడే క్షేమంగా గమ్యానికి చేరగలుగుతాం. అలాగే చంచలమైన ఇంద్రియాలను మనసు అనే కళ్ళెంతో అదుపుచేస్తూ బుద్ధి అనే సారథి, రథం అనే శరీరాన్ని నడిపించినప్పుడే మోక్షపదాన్ని చేరుకోవడం సాధ్యమని కఠోపనిషత్తు వివరిస్తుంది.

రథం దృఢంగా ఉండవచ్చు, సారథి నైపుణ్యవంతుడు కావచ్చు, మార్గం సుగమంగా ఉండవచ్చు కానీ గుర్రాలు అదుపులో లేకపోతే గమ్యాన్ని చేరుకోలేం. మన జీవన యాత్రలో ఇంద్రియాలనే గుర్రాలు ఆధీనంలో లేకపోతే ఆత్మసాక్షాత్కారాన్ని పొందడం అసాధ్యం. కాబట్టి బహిర్ముఖమైన ఇంద్రియాలను అంతర్ముఖం కావించి ప్రయాణం కొనసాగించాలి.

ఆత్మసాక్షాత్కారమే అంతిమ లక్ష్యం : దివ్యశక్తి అందరిలోనూ ఉంది. అంతర్గతంగా ఉన్న ఆ దివ్యశక్తిని తెలుసుకోవడమే మన జీవిత గమ్యం. ఆ గమ్యాన్ని చేరుకున్నవాడు ధన్యజీవి, దివ్యజీవి అవుతాడు. అంతర్గతంగా ఉన్న దివ్యశక్తిని అభివ్యక్తం చేయడం ఎలాగో స్వామి వివేకానంద బోధించారు.

Each soul is potentially divine. The goal is to manifest this Divinity within by controlling nature, external and internal. ***- Swami Vivekananda***

'ప్రతి యాత్మ దివ్యంబె తత్వతః దివ్యంబె
లోబయళ్ళగల ప్రకృతిని స్వాధీనంబున నుంచుకొని
అంతర్గతమగు దివ్యత్వమ్మును అభివ్యక్త పరచుటె జీవితగమ్యం'.

మనలో ఉన్న దివ్యత్వాన్ని ప్రస్ఫుటం చేయడం ముఖ్యంగా బాహ్య, అంతర ఇంద్రియాలను నియంత్రించడం వల్లనే సాధ్యమవుతుంది అని స్వామి వివేకానంద బోధించారు. కాబట్టి ఇంద్రియ నిగ్రహం ఆత్మసాక్షాత్కారానికి అత్యంత కీలకం.

ఇంద్రియాలను నిగ్రహించడం కోసం శమదమాలను అభ్యసించాలి. పంచ బాహ్యేంద్రియాలను నియంత్రించడం దమం అనీ, అంతరేంద్రియం అయిన మనసును నియంత్రించడం శమం అనీ శాస్త్రాలు చెబుతున్నాయి.

బాహ్య ఆకర్షణలకు లోనయ్యే స్వభావం కలవిగా భగవంతుడు ఇంద్రియాల్ని సృష్టించాడు. అలాంటి బహిర్ముఖమైన ఇంద్రియాలను అంతర్ముఖం చేయడం ఎలా?

Do this either by work, or worship, or psychic control, or philosophy...

- Swami Vivekananda

కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన మార్గాలలో ఏ ఒక్క మార్గాన్నైనా అవలంబించి బాహ్య, అంతర ఇంద్రియాలను నియంత్రించవచ్చని స్వామి వివేకానంద బోధించారు.

నిష్కామ సేవతో (కర్మయోగం)గానీ, జపతప సాధనలతో (భక్తియోగం)గానీ, ధ్యానంతో (రాజయోగం)గానీ, నిత్యానిత్యవస్తు వివేకంతో (జ్ఞానయోగం)గానీ ఇంద్రియాలను నియంత్రించి మన గమ్యస్థానమైన పరమపదాన్ని చేరుకోవడానికి ప్రయత్నించాలి. అలా భగవంతుణ్ణి చేరడానికి నిత్యం సాగే **'మన జీవనయాత్రే ఓ రథయాత్ర'.** ❖

గోరుముద్ద

నైతికత

- స్వామి సుప్రియానంద

మనది ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం. ఏ సమాజంలో అయినా భిన్నత్వం సహజం. సమాజం వివిధ జాతుల, మతాల, కులాల సమ్మేళనం; ప్రజల ఆర్థిక స్థితి గతులలోనూ, మానవ మేధలోనూ, సామాజిక సాంస్కృతిక పరిస్థితులలోనూ భిన్నత్వం ఉంటుంది. సమాజంలో భిన్నత్వం ఉన్నప్పటికీ, ప్రజలందరూ ఒకే కుటుంబ సభ్యులవలె సమైక్యంగా శాంతి, సహకారాలతో కలిసి మెలిసి జీవించాలి. బలవంతులు బలహీనులకు సహాయపడాలి. ధనవంతులు పేదవారిని ఆదుకోవాలి. ప్రతి ఒక్కరూ సమిష్టి సంక్షేమం కోసం కృషి చేయాలి. ఇది కలా? నిజమా? ఇది ఎలా సాధ్యం? నిరంతరం తమ రాజకీయ పార్టీల కోసం, తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రాకులాడే వారి వల్ల ఇది ఎప్పటికీ సాధ్యం కాదు. కేవలం మనిషిలోని నైతిక విలువలు అభివృద్ధి చెంది వ్యక్తమైనప్పుడే ఇది సాధ్యం.

కాలం గతించవచ్చు. తరాలు మారవచ్చు. తుపానుల నుండీ, పెనుగాలుల నుండీ, అలల తాకిళ్ళ నుండీ తీర మైదానాన్ని రాతి కొండలు ఏ విధంగా రక్షిస్తాయో, అదే విధంగా మనిషి 'మనుగడ'ను 'నైతిక' విలువలు కాపాడతాయి.

నైతిక విలువలు ఉన్న మనిషిలో ధార్మిక చింతన ఆ పైన ఆధ్యాత్మిక చింతన కలుగుతాయి. అంటే 'నైతికత' ధార్మికతకూ, ఆధ్యాత్మికతకూ సోపానం.

జీవితంలో నైతిక విలువలు లోపించినప్పుడు అది పతనానికి దారి తీస్తుంది. ఆ సమాజంలో 'అసమతుల్యత' అనే 'ప్రళయం' సంభవిస్తుంది. ఇది సమాజంలోని అన్ని రంగాలలోకీ ప్రవేశించి సమాజాన్ని పీల్చి పిప్పి చేస్తుంది. అప్పుడు పాలనా వ్యవస్థనూ, ప్రభుత్వాలనూ నిందించి ప్రయోజనం ఉండదు. ప్రజలు ఎలాంటి వారో వారికి అలాంటి ప్రభుత్వమే లభిస్తుంది.

చాలా మంది 'రామరాజ్యం' కోసం కలలు కంటుంటారు. కానీ ఆ 'రామరాజ్యం'లోని పాలనా వ్యవస్థను కొంచెం పరికించి చూసినప్పుడు పౌరులుగా మన బాధ్యత తెలిసివస్తుంది.

మహాకవి కాళిదాసు తన 'రఘువంశం' (సూర్యవంశ రాజుల చరిత్ర- సాక్షాత్తు శ్రీరామ చంద్రుడు ఈ వంశానికి చెందిన వారు)లో ఆనాటి పరిపాలనా వ్యవస్థను ఇలా వర్ణిస్తారు:

ప్రజానాం ఏవ భూత్యర్థమ్
సతాభ్యో బలిం అగ్రహీత్ ।
సహస్ర గుణాం ఉత్ స్రష్టుమ్
ఆదతే హి రసం రవిః ॥

ఎలాగైతే సూర్యుడు తేమను గ్రహించి వర్షాలు కురిపిస్తాడో, అలాగే ప్రజల సమిష్టి సంక్షేమానికి రాజు పన్నులు కట్టించు కుంటాడు.

ఇందులో మన సమిష్టి సంక్షేమం కోసం పన్నులు కట్టాలి అన్న నైతికత గోచరిస్తుంది. కాని నేటి పరిస్థితి...?

నిజంగా 'రామరాజ్యం' కావాలంటే (రావాలంటే), కౌసల్యా సుప్రజా రామా... అంటూ రాముడికి 'సుప్రభాతం' పాడటమే కాదు మనం 'సుప్రజలం' అవ్వాలి. ❖

పండుగలు - పర్వదినాలు

జూన్- 2009

03	బుధవారం	:	ఏకాదశి
19	శుక్రవారం	:	ఏకాదశి
24	బుధవారం	:	పూరీ జగన్నాథ రథయాత్ర

జూలై- 2009

03	శుక్రవారం	:	ఏకాదశి
07	మంగళవారం	:	గురు పూర్ణిమ
18	శనివారం	:	ఏకాదశి
20	సోమవారం	:	స్వామి రామకృష్ణానంద జయంతి



జగన్నాథుడే శ్రీరామకృష్ణులు

– స్వామి జ్ఞానదానంద

1885 జూలై 15వ తేదీన శ్రీరామకృష్ణులు, 'మ'తో ఇలా చెప్పారు: "ఒకసారి తీవ్రమైన మధుర భావంతో జగన్నాథుణ్ణి ఆలింగనం చేసుకోబోయి చెయ్యి విరగ్గొట్టుకున్నాను. అప్పుడు నాకు ఇలా వెల్లడయింది: 'నువ్విప్పుడు మానవ దేహం ధరించి ఉన్నావు. కాబట్టి మానవులతో సఖీభావం, వాత్సల్యభావం మొదలైన భావాలను ఏర్పరచుకొని ఉండు."

గురుదేవులు భక్తులతో అనేకసార్లు, "నేను పూరీలో వెలసిన జగన్నాథుణ్ణి" అని చెప్పేవారని 'మ' తెలిపారు. 'మ' ఇంకా ఇలా చెప్పారు:

"ఒకసారి ఆయన నన్ను పూరీ పంపించి అక్కడ ఏం చేయాలో ఆదేశించారు. అక్కడ జగన్నాథుణ్ణి ఆలింగనం చేసుకోవాలని చెప్పారు. అలా చేయడం దాదాపు అసాధ్యం కనుక నేను ఆదుర్దా చెందాను. అప్పుడు నా మనసులో ఒక ఆలోచన వచ్చింది. గర్భగుడిలోకి ప్రవేశిస్తున్నప్పుడు నా జేబులో చాలా చిల్లర నాణేలూ, కొన్ని రూపాయి కాగితాలూ ఉంచుకొన్నాను. అక్కడ కాస్త చీకటిగా ఉంది. నేను ఉద్దేశపూర్వకంగా నాణేలను, రూపాయి కాగితాలను నేలమీద వెదజల్లాను. నాణేల సవ్వడి వినగానే పూజారులు క్రింద పడ్డ ఆ సొమ్మును సేకరించుకోనారంభించారు. అదే అదునుగా నేను దైవపీఠం ఎక్కి జగన్నాథుణ్ణి ఆలింగనం చేసుకొన్నాను. ఎవరో నన్ను చూసి పెద్దగా కేక పెట్టారు. వెంటనే నేను దిగి జనంలో కలిసిపోయి, విగ్రహానికి ప్రదక్షిణ చేయనారంభించాను. ఆ చీకట్లో నన్ను ఎవరూ గుర్తించలేక పోయారు. శ్రీరామకృష్ణులు నన్ను పలుమార్లు పూరీ పంపించారు. ఆయన మాత్రం పూరీ వెళ్ళలేదు. దాని గురించి వారు నాతో ఇలా చెప్పారు : "నేను పూరీ కనుక వెళితే, ఈ దేహం ఉండదు కాబట్టి వెళ్ళలేదు". నేను పూరీ నుంచి తిరిగి రాగానే గురుదేవులు నన్ను ఆలింగనం చేసుకొని, 'ఇదుగో జగన్నాథుణ్ణి ఆలింగనం చేసుకొన్నాను" అన్నారు.

తమ కుమార్తె మరణానంతరం మనోమోహన్ మిత్రా, అతడి భార్య 1900లో పూరీ వెళ్ళారు. కలరా సోకి అతడి భార్య అక్కడే మరణించింది. ఒకరోజు మనోమోహన్ ఆలయంలో ప్రవేశించగానే, దైవపీఠం మీద జగన్నాథునికి బదులు శ్రీరామకృష్ణులు కొలువుదీరి ఉన్నట్లు చూశాడు. గురుదేవులను చూడగానే అతడు, "శ్రీరామకృష్ణుల రూపంలో ఉన్న జగన్నాథస్వామికి జై" అంటూ కేక పెట్టాడు.

1917లో స్వామి తురీయానంద పూరీ వెళ్ళారు. ఒకరోజు జగన్నాథ స్వామి ఆలయానికి వెళ్ళారు. ఆయన సింహద్వారపు మెట్లు ఎక్కుతుండగా, శ్రీరామకృష్ణులు మెడలో పూలమాలను ధరించి మెట్లు దిగుతూ ఎదురు వచ్చారు. స్వామి తురీయానంద ముందుకు పరుగెత్తి ప్రణమిల్లారు. స్వామి తురీయానంద ఇలా చెప్పారు: "శ్రీరామకృష్ణులుగా మెట్లు దిగివచ్చింది సాక్షాత్తూ జగన్నాథుడే! 'నేను అక్కడకు వెళితే నా దేహం మరి ఉండదు' అనేవారు."

గురుదేవుల చిన్నన్నగారి కుమార్తె లక్ష్మి ఇలా గుర్తుకు తెచ్చుకొన్నారు: "ఒకసారి బలరామ్ జగన్నాథ ప్రసాదం గురుదేవులకు ఇచ్చారు. గురుదేవులు తమ తలకు ప్రసాదాన్ని తాకించి భావపారవశ్యంలోకి వెళ్ళిపోయారు. ఆయన ఇలా చెప్పారు. 'నేను పూరీలో ఉన్నట్లు ఉంది. విస్తృత సముద్రం, వెడల్పయిన కాలిబాటలు, అనంతుడైన జగన్నాథుడు ప్రతిదీ పెద్దదే! నేను అక్కడకు వెళితే ఈ శరీరం అంతరిస్తుంది (తాము జగన్నాథుడిలో విలీనమైపోతానని అర్థం)."

1925 వసంత కాలంలో బిపిన్ అనే భక్తునితో కలిసి లక్ష్మి జగన్నాథుణ్ణి దర్శించేందుకు పూరీ వెళ్ళింది. ఆలయంలో ప్రవేశించిన ఆమెకు గర్భగుడిలో గురుదేవుల దర్శనం లభించింది. మరో సందర్భంలో ఆలయంలో సాక్షాత్తూ జగన్నాథుడే ఆమె ఎదుట కనిపించి, "నేనూ మీ రామకృష్ణులూ అభిన్నులం" అని చెప్పాడు.

సర్వదేవదేవీ స్వరూపులైన శ్రీరామకృష్ణులు సాక్షాత్తూ ఆ జగన్నాథస్వామియే అన్న విషయం పై సంఘటనలు నిరూపిస్తున్నాయి. ❖

జన్మరాహిత్యాన్నిచ్చే
జగన్నాథుడు

సేకరణ: కుమారి ఎ. జయంతి

ప్రతీ సంవత్సరమూ పూరీలో ఆషాఢమాసంలో జరిగే జగన్నాథుని రథయాత్ర చాలా విశేషమైనది. ప్రధాన ఆలయం అయిన శ్రీమందిరంలో నిత్యం ఆరాధింపబడుతున్న జగన్నాథస్వామినీ, బలభద్ర స్వామినీ, సోదరి సుభద్రనీ... వీరితో పాటు సుదర్శన చక్రాన్నీ వారి వారి రథాల్లో ఉంచి ఆలయానికి 2-3 కి.మీ. దూరంలో ఉన్న గుండీచా మందిరానికి తీసుకుని వెళ్ళే ఈ ఉత్సవంలో 5, 6 లక్షల మంది పాల్గొంటారు. ఒక వారం అక్కడ ఉన్నాక తమ నివాసమైన శ్రీమందిరానికి తిరిగి వెళ్తారు ముగ్గురూ, దానిని మారు రథయాత్ర అంటారు.

రథయాత్ర ప్రాముఖ్యత: ఈ ఉత్సవానికి గుండీచా యాత్ర, ఘోష యాత్ర, నవదిన యాత్ర, దశావతార యాత్ర... ఇలా చాలా పేర్లున్నాయి. 'రథేతు వామనమ్ దృష్ట్వా పునర్జన్మమ్ న విద్యతే - రథంపై ఉన్న వామనమూర్తిని దర్శించడం వల్ల జనన మరణాలనే చక్ర భ్రమణం నుండి ముక్తి లభిస్తుంది' అని అంటారు.

గర్భగుడిలో నిత్యం పూజలందుకుంటున్న దివ్య మూర్తులు యాత్రలో పాల్గొనడం చాలా అరుదుగా జరుగుతుంది. కలియుగంలో మానవులకి ముక్తిని ప్రసాదించి వారి బాధలనూ, క్లేశాలనూ తొలగించే జగన్నాథుని రథయాత్ర చాలా విశేషమైనది. జగన్నాథ స్వామి స్వయంగా విష్ణుమూర్తే! మొట్టమొదట ఆయన నీలమాధవునిగా మర్రి చెట్టు (న్యగ్రోధ వృక్షం) పైన ఆరాధింపబడినాడు. ఆ చెట్టు శాఖలు అనేక మైళ్ళ దూరం వరకూ విస్తరించి ఉన్నాయి. ఆ ప్రాంతంలో అడుగుపెట్టిన వారికి వెంటనే ముక్తి లభిస్తుంది. పవిత్రమైన పూరీ క్షేత్రంలో యముడు ప్రవేశించలేడు అంటారు. అందువల్ల ఈ క్షేత్రానికి 'యజమనిక తీర్థం' అని పేరుంది.

రథంలో ఆసీనుడైన జగన్నాథుని దర్శనం చాలా శుభప్రదమైనది. రథోత్సవం ఎంత పవిత్రమైనదో చెప్తూ... రథాన్ని తాకినా, కనీసం రథం లాగడానికి కట్టిన తాళ్ళను తాకినా చాలు... అనేక పుణ్యకార్యాలు చేసిన ఫలం లభిస్తుంది, అనేక జన్మల పాపాలు తొలగిపోతాయి అని చెప్తారు. "ఈ ఉత్సవ సమయంలో రథము, చక్రాలు, రథం వెళ్ళే మార్గం కూడా స్వయం జగన్నాథుడే" అనే భావం వచ్చే పాట ఒరియా భాషలో ఒకటి ఉంది.

స్కంద పురాణంలో రథయాత్ర వైశిష్ట్యాన్ని ఇలా స్తుతించారు:

గుండీచామండపం నామం యాత్రాహ మజనమ్
పురా అశ్వమేధ సహస్రస్యా మహాబేది తదద్వవత్

"శ్రీమందిరంలో ఉంటూ రథాలపై ఊరేగింపుగా వెళ్ళి గుండీచా మందిరానికి చేరిన దైవాన్ని అక్కడ చూసిన వారు ధన్యులు, వారికి వెయ్యి అశ్వమేధ యాగాలు చేసిన ఫలితం లభిస్తుంది".

చందన యాత్ర: రథోత్సవంలో భాగంగా ముందు చందన యాత్ర ... 21 రోజుల పాటు చందనం కలిపిన నీటితో స్నానం చేయించి దేవతా (దారు) ప్రతిమలని నరేంద్ర సరోవరంలో ఒక పడవ మీద యథావిధిగా విహరింపచేస్తారు.

స్నాన యాత్ర: ముగ్గుర్నీ స్నానవేదిక పైకి తీసుకుని వెళ్ళి 108 బిందెల నీటితో స్నానం చేయిస్తారు. దీని తరువాత ముగ్గురూ అనారోగ్యం నుండి గర్భగుడిలో కోలుకుంటారనీ, వారికి చికిత్సగా ఆయుర్వేదం మందులు, ఆహారంగా ద్రవపదార్థాలు ఇస్తారనీ అంటారు. ఆ 15 రోజులూ యాత్రికులు, భక్తులు దేవతా ప్రతిమల స్థానే ఉన్న చిత్రపటాలని మాత్రమే దర్శించగలరు.

ఇవన్నీ అయ్యాక ఆ తరువాతి నెల (ఆషాఢ మాసం)లో శుద్ధవిదియ నాడు కనుల పండువగా రథోత్సవం జరుగుతుంది. ❖ (జూన్ 24న పూరీజగన్నాథ రథయాత్ర)

పునర్జన్మను ప్రసాదించిన పుణ్యదంపతులు

స్వామి జపానంద హిమాలయాల్లో ఉన్న గంగోత్రిలో కొంతకాలం గడిపిన తరువాత కేదార్‌నాథ్, బద్రీనాథ్ దర్శించి అక్కడ నుంచి హృషీకేశ్, హరిద్వార్ ప్రయాణమయ్యారు. మధ్యలో త్రిగుణీ నారాయణ తీర్థం వెళ్ళి అలాగ కేదార్ వెళదామని కొండల్లో తోవ గురించి వాకబు చేసారు. అలాగ ఒకరి సలహామేరకు నిర్జనంగా ఉన్న కాలిబాటలో వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు.



ప్రయాణం మధ్యలో పెద్ద వాన కురిసింది. దగ్గరలోనే ఉన్న పల్లెకి కష్టపడి చేరుకుని అక్కడ సత్రంలో తలదాచుకున్నారు. అక్కడ చాలా మంది యాత్రికులున్నారు. వర్షం కారణంగా ఎవరూ ఎక్కడికీ వెళ్ళలేకపోతున్నారు. ఎవరో పెద్దమనిషి తన పక్కనే సన్న్యాసికి కొంచెం స్థలం చూపించారు. సన్న్యాసి కృతజ్ఞతలు చెప్పి కూర్చున్నారు. రెండు రోజులు ఆ సత్రంలోనే గడిపారు. మూడవరోజు మధ్యాహ్నం వాన వెలిసింది. మంచు బాగా పడింది. నాలుగు వైపులా కొండ శిఖరాలు తెల్లటి దుప్పటి కప్పుకున్నట్లు ఉన్నాయి.

వాన వెలిసిపోయింది. అందుకని సన్న్యాసి ఇంక అక్కడ ఉండదలుచుకోలేదు. యాత్రికుల రాకతో స్థలాభావం కూడా ఏర్పడింది. త్రిగుణీ నారాయణ తీర్థం వెళ్ళడానికి కాలిబాట మీద బయల్దేరారు. తోవలో ఎవరూ కనబడలేదు. ఎటు చూసినా నాలుగు వైపులా మంచు తప్ప మరేమీ కనపడడంలేదు. అందువలన తోవ తప్పిపోయారు. నెమ్మదిగా అదే తోవలో నడుస్తూ కొండ శిఖరానికి చేరుకున్నారు. అక్కడంతా కూడా మంచు ఆవరించి ఉంది. దూదిలాగ మెత్తగా ఉన్న మంచులో నడుస్తూ ఉంటే కాళ్ళు లోపలకి కూరుకుపోతున్నాయి. కాళ్ళు తిమ్మిర్లు ఎక్కడంతో స్పర్శ తెలియడం లేదు,

కర్ర సహాయంతో నడుస్తున్నారు. చేతి వేళ్ళు చలికి కొంకర్లు తిరుగుతున్నాయి. ఎలాగో కాళ్ళు ఈడ్చుకుంటూ నడుస్తున్నారు. ఇలాగే మంచులోనే సమాధి అయిపోతానేమో అని అనుకుంటూ ఉండగా మంచు తగ్గుతున్నట్లు అనిపించింది. ఇంకా ముందుకి వెళితే అక్కడ చిన్న చిన్న మొక్కలు, తుప్పలు కనిపించాయి. దగ్గరలోనే చిన్న గుడిసె కూడా కనిపించింది. ఎలాగో పడుతూ లేస్తూ ఆ సన్న్యాసి ఆ గుడిసె దగ్గరకి చేరుకున్నారు. ఆ గుడిసెలో టిబెట్టుకి చెందిన ఒక కుటుంబీకులు చలిమంట వేసుకుని కాచుకుంటున్నారు. వాళ్ళ గొర్రెలు దగ్గరలోనే తిరుగుతున్నాయి. వాళ్ళు సన్న్యాసిని చూడగానే అతని పరిస్థితి అర్థం చేసుకున్నారు. చలికి, మంచులో తడవడంతోనూ కొయ్య బారిపోయి ఉన్న సన్న్యాసిని చూసి భార్యాభర్తలిద్దరూ త్వరగా లోపలకి తీసుకెళ్ళి మంట దగ్గర కూర్చోమన్నారు. ఇంకా కర్రలు వేసి మంటని ఎగదోసారు. సన్న్యాసికి చాలా సేపటి వరకూ నోట మాట రాలేదు. ఆ దంపతులు వేడి టీ తీసుకొచ్చి సన్న్యాసితో "చాతుమ్, చాతుమ్– టీ తాగండి, టీ తాగండి" అన్నారు. నాలుగో ఐదో కప్పుల వేడి వేడి టీ తాగిన తరువాత సన్న్యాసికి కొంచెం చురుకుదనం వచ్చింది.

మంచులో సమాధి అయిపోవలసిన తనకు పునర్జన్మను ప్రసాదించిన ఆ దంపతులు నిజంగా పార్వతీ పరమేశ్వరులే అని స్వామి జపానంద భావించారు. ❖

అనువాదం : శ్రీమతి జి.ఎస్. లక్ష్మి

దేవీ వైభవం

ప్రవచనం: **శ్రీ సామవేదం షణ్ముఖశర్మ** విలేఖనం: **శ్రీమతి ఎన్. శేషు**

(...గత సంచిక తరువాయి)

అమ్మవారికి అయ్యవారికి నామసామ్యం, రూపసామ్యం అధిష్ఠానసామ్యం, కృత్యసామ్యం, అవస్థాసామ్యం అని ఐదు సామ్యాలున్నాయి. శివః-శివానీ, భవః-భవానీ, రుద్రః -రుద్రాణీ, శంకర-శాంకరీ, శంభు-శాంభవీ, చంద్రశేఖర – చంద్రశేఖరీ – ఇవి నామ సామ్యములు. రూపసామ్యమంటే – ఆయన ఏరూపం ధరిస్తే దానికనుగుణంగా ఉంటుందావిడ. ఆయన శబరాకృతి ధరిస్తే అమ్మవారు శబరి అని పక్కనే ఉంటుందట వనదుర్గా స్వరూపంలో. ఈ రూపాన్ని తలచుకుంటే ఒక ప్రయోజనం ఉంది. అమ్మ రూపాల్లో ఇదొక దివ్యరూపం. ఆ మహానుభావుడు మహాకాళుడై విహరిస్తే ఆమె మహాకాళిగా దర్శనమిస్తుంది. ఆయన కామేశ్వరుడైతే ఈమె కామేశ్వరి. ఇలాగ నామసామ్య, రూపసామ్యములు కనిపిస్తాయి. తరువాత అధిష్ఠాన సామ్యము. శ్రీచక్రం అమ్మవారికి అధిష్ఠానంగా ఆరాధిస్తున్నాం. "శ్రీచక్రం శివయోర్వపుః"– శ్రీచక్రమంతా కూడా శివశక్తుల స్వరూపం అన్నారు. ఎలా అంటే ... పైకి వెళ్ళే త్రికోణాలు నాలుగూకూడా అయ్యవారి రూపాలనీ, క్రిందికి వచ్చే త్రికోణాలు ఐదూ అమ్మవారి స్వరూపాలనీ చెప్తారు. ఈ రెండిటి సమైక్యత వలన ఏర్పడుతుంది శ్రీచక్రం. అందుకు "చతుర్భిః శ్రీకంఠైః శివయోత్రిభి పంచభిః" అన్నారు.

మరికొందరు వ్యాఖ్యాతలు ఏమిటి చెప్పారంటే... శ్రీచక్రంలో బిందు చక్రాలు నాలుగు, త్రికోణ చక్రాలు ఐదుగా ప్రస్తావించబడుతున్నాయి. త్రికోణ చక్రం అంటే శ్రీచక్రంలో ఉన్న బిందువుని వదిలిపెడితే మొదట వచ్చేది త్రికోణం, తరువాత అష్టత్రికోణం, తరువాత దశ త్రికోణం, ఆ తరువాత మరొక దశ త్రికోణం ఆ తరువాత 14 త్రికోణాలతో కూడిన ఆవరణ. ఈ మొత్తం త్రికోణ ఆవరణలు ఐదున్నాయి. బిందు ఆవరణలు నాలుగున్నాయి. బిందు ఆవరణలు అంటే వృత్తాలు. వృత్తం, బిందువు ఒకటే. బిందువు విస్తరిస్తే వృత్తం; వృత్తం సంకోచమైతే బిందువు. వృత్తం వ్యాపకమవుతే చతురస్రం. ఇందులో బిందు చక్రాలు నాలుగు (మధ్యలో ఉన్న బిందువు ఒకటి, చతుర్దశ ఆవరణలు అయిన తరువాత వచ్చే అష్టదళ వృత్త చక్రము, తరువాత షోడశ దళ వృత్త చక్రము, ఆ తరువాత చతరస్రం) ఈ నాలుగు బిందు చక్రములు అయ్యవారు, ఐదు త్రికోణ చక్రాలు అమ్మవారు. అందుకు "చతుర్భి శ్రీ కంఠైశివయోత్రిభిః పంచభిః త్రికోణ రూపిణిశక్తిః బిందురూపా శివస్మృతా, శివ శక్త్యైశ్చ మేళనం శ్రీచక్రం శివయోర్వపుః" అని లలితాత్రిశతి చదివిన తరువాత ఫలశ్రుతిలో చెప్పబడింది. శ్రీచక్రం ఏమిటో అమ్మవారి స్వరూపం అదే, కనుక అమ్మవారు శివశక్తుల స్వరూపమే. అమ్మవారు మనకి మన శరీరంలో శ్రీచక్రం ఇచ్చి పంపించారు. ఇందులో ప్రతి అణువునా ప్రసరిస్తున్నది అమ్మవారి యొక్క సౌందర్యలహరి. ఒక్కసారి మనం ధ్యానం చేసుకుని ధ్యానభంగిమలో కూర్చుంటే మనమే ఒక మేరు ప్రస్తారపు శ్రీచక్రం లాగ మారిపోతాం. "బైందవం బ్రహ్మరంధ్రంచ" బిందుస్థానం నుండి ఊరువుల వరకూ క్రమంగా మేరు ప్రస్తార శ్రీచక్రం మనలోనే గోచరమవుతుంది. దానికి ఉపదేశాలేవీ అవసరం లేదు. భక్తి, ధ్యానం చాలు. అమ్మవారి పటం ఇంట్లో పెట్టుకున్నా శ్రీచక్రం పెట్టుకున్నట్లే. శ్రీచక్రోపాసనకి మాత్రం గురువు ఉపదేశం కావాలి. యంత్రం, మంత్రం అనుగ్రహం పొందడానికి సాధనలే కాని యంత్రం ద్వారా మంత్రంద్వారా మాత్రమే నేను అనుగ్రహిస్తానని అమ్మవారెక్కడా చెప్పలేదు.

అమ్మవారి అనుగ్రహం ఎలా దొరుకుతుందో లలితా సహస్రం చెప్పింది. లలితా సహస్రం అమ్మకి సంబంధించిన సైన్సు. ఏది కావాలన్నా అందులో నుండి తీసుకోవచ్చు. అమ్మని ఏ విధంగా మనం పొందవచ్చో నాలుగు మార్గాలు అమ్మే చెప్తుంది. భావన, భక్తి, ధ్యానము, జ్ఞానము– ఈ నాలుగింటితో అమ్మవారిని మనం గ్రహించగలం. భావన చెయ్యడం, భక్తిమార్గాన్ని అనుసరించడం అన్నిటికన్నా గొప్పది. భక్తిద్వారానే నన్ను తెలుసుకోగలవని శ్రీకృష్ణుడు గీతలో

బోధించాడు. భక్తికావాలి, భక్తితో కూడిన ధ్యానం కావాలి. ధ్యానం ద్వారా అమ్మ యొక్క ఆ దివ్యచైతన్యం అనుభూతిలోకి వస్తుంది. ఆ చైతన్యానుభవమే జ్ఞానం. ఇక్కడ జ్ఞానం అంటే శాస్త్రజన్య జ్ఞానంకాదు. చైతన్యానుభవమే జ్ఞానం. రుచి అనే అనుభవం నాలుకకి తగిలితేనే అదేమిటో తెలుస్తుంది. అలాగే ఆత్మతత్త్వం అనుభూతిలోకి రావడమే నిజమైన జ్ఞానం. జగదంబిక యొక్క మంత్రం లభించిందా, ఆ బీజాక్షరాలు లభించాయా జన్మ చరితార్థమై పోతుంది. ఎవరిది చరమ జన్మో వారికి శ్రీవిద్య వస్తుంది అన్నారు. అయితే నాకు శ్రీవిద్య రాలేదే అని బాధపడనక్కర్లేదు. విశ్వమే శ్రీ విద్య, విశ్వచక్రమే శ్రీచక్రం. ఈ శరీరమే శ్రీచక్రం అని తెలిసి, అమ్మని ఉపాసిస్తే ఎప్పుడు ఎలాగ అనుగ్రహించాలో ఆ అమ్మ చూసుకుంటుంది, ఎందుకంటే ఆవిడ గురుమండల రూపిణి. "సంప్రదాయేశ్వరీ సాధ్వీ గురుమండల రూపిణీ"... ఇలాగ అమ్మని మనం భక్తి పూర్వకంగా ఆశ్రయిస్తున్నాం. అందుకు ఈ ధ్యానం, భావన బలపడడానికి మనం ఈ స్వరూపాలన్నీ చెప్పుకుంటున్నాం. అమ్మ యొక్క ఆ దివ్య మంగళ విగ్రహాన్ని చూడగానే ఇంత తత్త్వం మనకి స్ఫురణకి రావాలి.

ఇప్పుడు మనం అమ్మ యొక్క దివ్యచరణ కమలాలని భావన చేద్దాం. ఆ పాదాల గురించి శంకరుల వారు ఎంతో వర్ణించి, ఎన్నో భావనలు చేశారు. మూకకవి పంచశతిలో కూడా పాదారవింద శతకం ఉంది. ఆయన పాదాల మీదే వంద పద్యాలు వ్రాసారు. శంకరుల వారు "దదానాం దీనేభ్యః శ్రియమనిసమాసాను సదృశే– దీనులకి కూడా వాళ్ళు ఎంత కోరుకుంటే అంతిస్తాయట ఆపాదాలు" అన్నారు. అందుకే దేవతాస్త్రీలు అమ్మవారి పాదాల దగ్గర రెండు చేతులూ జోడించి నమస్కరిస్తుంటే అమ్మ పాదాల వేళ్ళ గోళ్ళు పరిహాసంగా నవ్వుతున్నట్లు కనిపిస్తున్నాయట. ఎందుకు నవ్వుతున్నాయంటే ఆ దేవతా స్త్రీలకి గొప్ప అవకాశం ఒకటి ఉంది. అదేమిటంటే కల్పవృక్షకుసుమాలని వాళ్ళు కోసి తీసికోగలరు. ఒక కల్ప వృక్షం ఉంటే చాలు మనకి దేముడు అక్కర్లేదు, ఎవరూ అక్కర్లేదు అనుకుంటారు మానవులు. మన కోరికలన్నీ కల్పవృక్షం తీరుస్తుంది. కోరికలే మనకి ప్రధానం, అవి తీరిపోతే ఇంక అమ్మవారు అక్కర్లేదు.

కోరిన వారందరికీ అమ్మవారు దర్శనమివ్వరు. అమ్మవారి పాదాలు చూడడమంటే సామాన్యమైన విషయం కాదు. అమ్మవారి భక్తులం అని చెప్పి అమ్మవారిని ఆశ్రయించిన వారు కూడా అమ్మవారిని చూడలేరు. ఎందుకంటే అమ్మవారు జగదేక సార్వభౌముడు–త్రిపురాసుర సంహారకుడైన ఆ విశ్వేశ్వరుని అంతఃపురమట. అయ్యవారి అంతఃపురంలోకి వెళ్ళి అమ్మవారిని మనం ఎలా చూడగలం!

అందరూ అమ్మవారిని ఆరాధన చేస్తారు, మరి అమ్మవారు అందరికీ దర్శనం ఇస్తారా? ఇవ్వరట. శంకరులవారు "ఇంద్రాది దేవతలు కూడా నీ ద్వారం దగ్గర నువ్విచ్చే సంపదలతో తృప్తిపడి వెనక్కి వెళ్తున్నారమ్మా" అన్నారు. ద్వారం దగ్గర అంటే అమ్మవారి ఆవరణలలో మొదటి ఆవరణ త్రైలోక్య మోహన చక్రం, అణిమాది అష్టశక్తులూ అక్కడే ఉన్నాయి. సర్వ దేవతలకూ మూలములైన బ్రాహ్మీ వైష్ణవీ మొదలైన మాతృకాశక్తులూ అక్కడే ఉన్నాయి; కావలసినవన్నీ అక్కడే దొరుకు తున్నాయి. అందుకు ఇంద్రాది దేవతలు వాటితో తృప్తిపడి వెనక్కి వెళ్ళిపోతున్నారు. ఎందుకంటే వాళ్ళకి కూడా కావల్సినది వాళ్ళ రాజ్యాలు క్షేమంగా ఉండడం, వాళ్ళలోకాలు బాగుండడం, వాళ్ళ పదవులు పదిలంగా ఉండడం, అంతే! అవన్నీ అక్కడే ఇచ్చేస్తోంది. వాళ్ళు అక్కడే తృప్తి పడి వెళ్ళిపోతున్నారు. అమ్మని చూడాలి అంటే ఇవన్నీ దాటి పోవాలి. అమ్మని అందుకోవాలంటే లౌకికమైన ఈ విషయ వాంఛలన్నీ దాటి నాకు ఆత్మ తత్త్వమే కావాలి అనాలి. మనలో 99 మందికి అమ్మ ఇచ్చేవే కావాలి కానీ అమ్మ అక్కర్లేదు. ఎవరైతే "అమ్మా నువ్వే కావాలమ్మా" అని బిడ్డలాగ రోదిస్తారో వారిని అమ్మ తప్పకుండా అంతఃపురంలోకి తీసుకెళ్ళి ఆదరిస్తుంది; అందులో సందేహంలేదు. ఈ విధంగా అమ్మ ఎంత దయామయో శంకరుల వారు భావన చేశారు. ఆ భావనలో అమ్మ చరణాలని ఒకసారి ధ్యానించితే చాలు, మనకి కావలసినవన్నీ లభిస్తాయి. ❖ **సశేషం**

మనోవికారాలకు అతీత స్థితి

శ్రీరాముడు: మనసులో ఇష్టాయిష్టాలు ఎందుకు కలుగుతాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఏ మనస్సైతే పూర్ణమైన ఆత్మ స్వరూప సాక్షాత్కారాన్ని పొందదో, అప్పుడది "ఇది నాకు ఇష్టం. ఇది నాకు కష్టం" అనే కల్పనలన్నీ చేసుకుంటోంది. అయితే, తత్త్వజ్ఞుల మనస్సు ఇలాగ చపలంగా ఉండదు. మనస్సు అనేది చేతనశక్తి నుండే స్ఫురిస్తోంది. కాబట్టి ఈ వాయు, ప్రకాశ, ద్రవత్వాలూ "మనస్సే", కఠినతనీ, శూన్యతనీ పొందుతున్నదీ అదే. చైతన్యం అనిర్వచనీయమైన తన ఇచ్ఛాశక్తిచేతనే ఇలా మనస్సు యొక్క రూపాన్ని స్వీకరిస్తోంది. అలాంటి మనోరూపంతో భావనామాత్రంగా దేశకాలాదుల అనుభవం తనలోని అంగీకారబుద్ధి వలన పొందుతోంది.

మనసు - సంలగ్నము : మనస్సు ఎక్కడ సంలగ్నమైతే అక్కడే ఆ భావనకు సంబంధించిన అనుభవాన్ని పొందుతుంది. ఒకడి మనస్సు ఎక్కడో లగ్నమై ఉన్నప్పుడు, అతడు తాను తింటున్న పదార్థపు రుచిని కూడా గుర్తించడుకదా! ఎదురుగా ఉన్న వస్తువుపై దృష్టి ఉన్నా కూడా, మనస్సు లగ్నం కాకపోతే ఆ వస్తువుని మనం చూడలేం.

ఓ రామా! అజ్ఞానికి ఈ చిత్తం - శరీరం వేరువేరుగా కనిపిస్తాయి. ఈ మనస్సే "నేనిలా అవుతాను" అని భావించి, అటువంటి భావనకు అనుకూలమైన ఆయా ఉపాధులను నిరంతరం పొందుతోంది. ఈ మనస్సుతో ఉపాధులకావల నిశ్చలంగా ఉన్న ఆత్మను గ్రహించేవారు ఉపాధి భావనను అధిగమించి, ఆత్మభావనను స్వీకరించగలుగుతున్నారు. అఖండమైన ఆత్మను ఎరిగినవారు అఖండభావననే పొందుతున్నారు. మహాత్ములు సర్వం గ్రహించడం వలన మనోరహితులై ఉంటున్నారు. కొందరు మహనీయులైన మునులు తమ మనస్సు ఆత్మయందు సంలగ్నమై ఉన్నప్పుడు తమ కాళ్ళూ, చేతులూ ఖండించినా కూడా గ్రహించకపోవటం మనం విన్నాం కదా! మాండవ్య మహామునిని "దొంగ" అనుకొని కొరత వేయటం జరిగినప్పుడు, ఆ శరీరం పొందిన హింస అతడు అనుభవించ లేదు. జ్ఞానులు అభ్యాసబలం చేతనే దుఃఖాలను సుఖాలుగా, స్త్రీ-ధన-వస్తుప్రాప్తులను తుచ్ఛమైనవిగా చూడగలుగుతున్నారు.

ఒకని మనసు ఎక్కడో సంలగ్నమై ఉంటే... నీవు అతనికి ఒక కథ ఎంత వివరంగా చెప్పినా అది గ్రహిస్తాడా? లేదు కదా! ఒకడు ఇంట్లోనే ఉండి "నేనిప్పుడు ఈ కొండను అధిరోహించాను. ఇక్కడ సరస్సు ఉంది. ఆ సరస్సును సమీపించాను చల్లనిగాలి వీస్తోంది. ఆహా! ఈ చెట్టు క్రింద ఇప్పుడు ప్రశాంతంగా విశ్రమిస్తాను..." అని భావిస్తున్నాడనుకో... అప్పుడతడు అక్కడ స్వచ్ఛమైన మేఘాలనూ, గుహలనూ కూడా భ్రాంతి వలన గాంచగలడు. అలాగే మరొకడు సుందరమైన పడకమీద పడుకొని, స్వప్నవశం చేత అనేక దుఃఖకరమైన ప్రదేశాలలో సంచరిస్తూ ఏడవటం, నవ్వటం మొదలైనవి అనుభవిస్తూ ఉంటాడు. స్వప్నంలో మనసు అనేక వ్యక్తులను, సంఘటనలను పొందుతోంది. స్వప్నంలోని ఆయా పదార్థాలన్నీ ఆ స్వప్న సమయంలో వాస్తవంలాగే తోస్తాయి. అవన్నీ ఎక్కడి నుండి వచ్చాయి? ఆత్మ తన స్వస్వరూపం నుండి చ్యుతి చెంది, క్షుభితమైనప్పుడు తన హృదయంలోనే ఆ స్వప్న వ్యవహారాన్ని అలాగ దర్శిస్తోంది.

సముద్రజలం నుండి తరంగాలు ఉత్పన్నమవుతున్నాయి. అలాగే ఈ దేహంలో అంతర్గతంగా ఉన్న మనసు నుండే ఆకార వికారాలు ఏర్పడుతున్నాయి.

ఆత్మతత్త్వాన్ని ఎవరైతే తెలుసుకుంటారో వారు మనోవికారాలకు అతీతులవుతారు. ❖

('శ్రీవసిష్ఠ రామ సంవాదం' - ఉత్పత్తి ప్రకరణం ఉత్తరార్ధం నుంచి) **అనువాదం : వై.హెచ్. రామకృష్ణ**

ధీరవాణి

-స్వామి వివేకానంద

ఓ సోదరులారా! కార్యశూరులుకండి!!

పాశ్చాత్యదేశాల్లోనూ, యూరోపు ఖండంలోనూ ప్రజలు భోగాలలో మునిగితేలుతున్నారు. భోగాలలో మునిగి వెగటు పుట్టడం వల్ల వారికి శాంతి లభించటం లేదు. ఈ దేశంలో భోగం లేదు, యోగం అంతకంటే లేదు. భోగాలను తనివి తీరా అనుభవించి వెగటు పుడితే కానీ, యోగాన్ని గూర్చిన బోధలు ఎవ్వరూ వినరు, అర్థం చేసుకోరు. రోగానికీ, శోకానికీ, పరితాపానికీ పుట్టినిల్లయి క్షుధార్తులతోను, దుర్బల మనస్కులతోను నిండి పోయిన భారతదేశానికి ఉపన్యాసాలు ఏం మేలు చేస్తాయి?

ధర్మం, మతం అంటే ఏం అర్థమవుతుంది? మొదట కావలసింది కూర్మావతార పూజ. పొట్ట దేవుడే ఈ కూర్మం. ఈ కడుపును శాంతపరిస్తేగాని, మీ ధర్మోపన్యాసాలు ఎవ్వరూ వినరు. ఈ ఆకలిభూతాన్ని ఎలా ఎదుర్కోవాలి అనే ఆలోచనతోనే భారతదేశం సతమతమవుతుంది. దేశ సంపదనంతా విదేశీయులు దోచుకొని పోవటం, అన్నిటికంటే ముఖ్యంగా ఈర్ష్య, అసూయలు భారతదేశపు జీవనాడులను తినేస్తున్నాయి. ఆ ఆకలి మంటలను ఆర్పటం మన ప్రథమ కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని పూర్తిగా నిర్వర్తించేవరకూ మత బోధలు చేయకూడదు. కూడు, గుడ్డ, నీడలను కల్పించకుండా ధార్మికోపన్యాసాలు చేయటంవల్ల ప్రయోజనం లేదు.

ఈ లోకమే సర్వస్వం అనుకుంటూ "నా సంసారం, నా సంసారం" అని దేవురిస్తే ఏం లాభం? దేశంలో ఒకమూల నుండి మరో మూలకూ, ఒక గ్రామం నుండి మరో గ్రామానికీ పోయి, ఇక ఊరికే కాలక్షేపం చేసినందువల్ల ప్రయోజనం లేదని ప్రజలకు అర్థమయ్యేటట్లు చెప్పడమే మీ ప్రస్తుత కర్తవ్యం. వారి నిజస్థితిని వారికి తెలియజేసి ఇలా చెప్పండి: ఓ సోదరులారా! లేవండి మేల్కోండి! ఇంకా ఎంత కాలం 'నిద్రపోతారు?. ఏ విధంగా వారి స్థితి మెరుగుపడుతుందో సరళ మార్గంలో వారికి చెప్పి శాస్త్రాలలోని సత్యాలు అవగతమయ్యేలాగ బోధించండి. వేద మంత్రాలను చండాలునితో సహా అందరికీ ఉపదేశించండి. సరళమైన మాటల్లో జీవితావసరాలైన వ్యాపారం, వ్యవసాయం మొదలైన వాటిని గూర్చి బోధించండి. ఇది మీరు చేయలేకపోతే, మీ విద్య, మీ సంస్కృతి, మీ వేద వేదాంతాధ్యయనాలు ఎందుకు?.

ప్రతిరోజూ ఎందుకూ పనికిరాని క్షుద్రకీటకాలు ఎన్ని పుట్టడంలేదు, చావడంలేదు. ఈ విశాల విశ్వానికి ఆ కీటకాల చావుపుట్టుకల వల్ల ఏ నష్టమూ ఉండదు. కాబట్టి జీవితంలో ఒక ఉన్నత ఆశయ సాధనలో మరణించడమే మేలు.

సోమరులుగా మీరు కాలం గడపడం నాకు బాధ కలిగిస్తోంది. సత్సంకల్పంతో కార్యశూరులుకండి! ఆలస్యం చేయవద్దు. రోజురోజుకూ మృత్యువు సన్నిహితమౌతున్నది. సోమరులుగా ఉంటే ఏ కార్యాన్నీ సాధించలేమని గుర్తుంచుకోండి! ❖

పరిప్రశ్న

- స్వామి సుకృతానంద

యల్. శాంతామూర్తి, పెద్దకొజ్జిరి.

? : విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామాలు చదివేటప్పుడు ఏకాగ్రత ఉండక మనసు ఇతర విషయాలపై వెళుతుంది ఏమి చేయాలి?

✍: సహస్రనామాలు పారాయణం చేసినప్పుడు మనస్సు అన్య విషయాలవైపు పోతుందంటే అందుకు కారణం మనలో భక్తి శ్రద్ధలు లోపించడమే! ఎప్పుడైతే చేసే పని మీద శ్రద్ధ సన్నగిల్లుతుందో ఆ పని యాంత్రికంగా మారుతుంది. కేవలం పూజ, పారాయణ, జపాదులయందే కాదు మనం నిత్యం చేసే ఏ పనిలోనైనా శ్రద్ధ కొరవడితే ఏకాగ్రత ఉండదు. అన్య విషయాలు గుర్తుకు వచ్చే సమయంలో మనసును పారాయణ శ్లోకాల అర్థాల వైపుకు మరలించాలి. ఇదే సాధన.

పి. శేషు బాబు, రాజమండ్రి.

? : పుట్టిన ప్రతి మానవుడూ ఏవో కర్మలు చేస్తాడు. అవే కర్మలు చేయడానికి గల కారణం ఏమిటి? వాటి గురించి భగవంతుడికి ముందే తెలుసా? తెలుసంటే ఆయనే చేయించాడని అనుకోవాలి. తెలియదంటే ఎవ్వరికి తెలుసు?

✍: ప్రతి జీవీ ప్రారబ్ధవశంగా జన్మను స్వీకరిస్తాడు. అంటే ముందుగానే అతడు ఎక్కడ జన్మించాలి, ఏయే కర్మలు చేయాలో అతడే నిర్ణయిస్తాడు. సంచిత కర్మల నుండి ప్రారబ్ధ కర్మ ఏర్పడుతుంది. అయినా తలిదండ్రుల ప్రభావం శిశువుపై ఉంటుంది. ప్రతి జీవీ తన స్థితికి తానే కారణం. భగవంతుడు కర్మఫల దాత. ఎంతటి మహాత్ములైనా ప్రారబ్ధం అనుభవించాలంటుంది శాస్త్రం. భగవంతుడు ఈ లోకాలన్నింటి సృష్టి, స్థితి, లయలు ప్రత్యక్షంగా కాకుండా ప్రకృతి – త్రిగుణాత్మిక మాయ ద్వారానే చేయిస్తాడు.

‘మయాఽ ధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్’ (భ.గీ. 9–10) జీవుల పుణ్యపాపాలు దేవుడు స్వీకరించడు. ‘నాదత్తే కస్యచిత్ పాపం న చైవ సుకృతం విభుః...’ (భ.గీ. 5–15) జీవునికి దేశకాలనిమిత్తాలతో ప్రమేయం ఉంది. భగవంతునికి కాదు. ఆయన దేశ కాల నిమిత్తాలకు అతీతుడు. యఃసర్వజ్ఞః సర్వవిత్... ఆయన సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి అని వేదం. చెబుతోంది. ప్రస్తుత జన్మ జీవుని అధీనంలో ఉంది. జీవుడు సాధు సాంగత్యం, భగవద్భక్తి, జ్ఞానంతో సత్వగుణ సంపన్నుడై దైవదర్శనం పొందవచ్చు. అది ఇక్కడే, ఇప్పుడే సాధ్యం.

ఆర్. సురేష్, ఎమ్మిగనూరు

? : మనోనిగ్రహం ప్రస్తుత కాలంలో సాధ్యమేనా? నియమాలు వివరించండి? జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలను అదుపులో పెట్టి మనసు పెడద్రోవ పట్టకుండా ఏమి చేయాలి?

✍: మనస్సు అంటే ఆలోచనల పుట్ట. ఆలోచనల్ని తీసేస్తే మనస్సు లేదు. ఇది మనకు ఎలా తెలుస్తుంది. గాఢ నిద్రలో మనస్సూ లేదు (అది అజ్ఞానంలో ఉంది), ఆలోచనలూ లేవు. మనస్సును నియంత్రించటం సాధ్యమే. ప్రతీ రోజూ ధ్యానంలో మనస్సును నియంత్రించాలి. మనస్సును అదుపు చేయడం అసాధ్యం అన్నాడు అర్జునుడు. శ్రీ కృష్ణుడు నిజమే అని ఒప్పుకొంటూ “మనస్సును అదుపు చేయడం కష్టమే కానీ, అసాధ్యం కాదు” అంటూ ఎవరైతే అభ్యాసం చేస్తారో వారు మనస్సును నిగ్రహించవచ్చు అంటాడు. ప్రపంచంలోని ఋషులు, మునులు, అవతార పురుషులు, ఆధ్యాత్మిక సాధకులు, శాస్త్రవేత్తలు అందరూ మనస్సును అదుపులో పెట్టుకొని అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. అలాగే కర్మేంద్రియాల్నీ, జ్ఞానేంద్రియాల్నీ వశపరచుకోవాలి. మనం ఎంచుకొన్న లక్ష్యంవైపుకే “తైలధార”లాగ (ఒక పాత్ర నుండి మరొక పాత్రలో నూనె పోస్తున్నప్పుడు అవిచ్ఛిన్నంగా ధారపడేటట్లు) మనస్సును పంపాలి. ఏకలవ్యుడు, అర్జునుడు మొదలైన వాళ్ళు చేసింది అదే. ధ్యానం ద్వారా మనస్సును నిశ్చల పరచవచ్చు. జీవితంలో అనుకొన్న లక్ష్యాన్ని సాధించిన వారందరూ మనస్సును నిగ్రహించే విజయులయ్యారు. మీరూ ప్రయత్నించండి. ❖

- రెంటాల జయదేవ

సకల శుభకరం శంఖం

భారతీయ సంస్కృతిలో శంఖానికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఆలయాల్లో కానీ, ఇళ్ళల్లో కానీ ఏదైనా పూజ చేస్తున్నప్పుడు శంఖం ఊదడం జరుగుతుంటుంది. శుభ సందర్భాన్ని సూచించడానికీ, ఉదయ, సాయంకాల వేళల్లో అర్చన సమయంలోనూ, హారతి సమయంలోనూ శంఖం ఊదడం సర్వసాధారణం. శంఖనాదం లేకుండా పూజ పూర్తయినట్లు కాదు. బెంగాల్ ప్రాంతంలో వివాహ సందర్భంగా శంఖధ్వని తప్పనిసరి. అలాగే, పూర్వకాలంలో యుద్ధ ఆరంభ సమయంలోనూ, యుద్ధంలో సైన్యం విజయం సాధించినప్పుడూ శంఖం ఊదడం ఆనవాయితీ. అంతేకాకుండా, శంఖాన్ని దైవపీఠంపై పెట్టి పూజించడం కూడా కద్దు.

శంఖం ఊదినప్పుడు సామాన్యంగా ఓంకార నాదం వినిపిస్తుంది. సృష్టి ఆరంభించే ముందు భగవానుడు మంగళప్రదమైన ఓంకార ఉచ్చాటన చేసినట్లు కథనం. కాబట్టి, ఆ రకంగా చూస్తే శంఖం, అది చేసే ధ్వని-ఈ ప్రపంచాన్నీ, దాని వెనుక ఉన్న సత్యాన్నీ చాటుతున్నాయి.

శంఖావిర్భావ గాథ : శంఖం ఆవిర్భావం గురించి ఓ కథ ప్రచారంలో ఉంది. పూర్వం శంఖాసురుడనే రాక్షసుడు ఉండేవాడట. వాడు దేవతలను ఓడించి, వేదాలను అపహరించి, సముద్రం అడుగున దాక్కున్నాడట. దిక్కుతోచని దేవతలు శ్రీహరిని సాయం వేడారు. అప్పుడు విష్ణుమూర్తి 'మత్స్యావతారం' ధరించి, ఆ శంఖాసురుణ్ణి సంహరించాడట! అప్పుడు ఆ దేవదేవుడు శంఖం ఆకారంలో ఉన్న ఆ రాక్షసుడి చెవినీ, శిరస్సునూ ఊదాడట. దాని నుంచి ఓంకారం వెలువడిందట. ఆ ఓంకార నాదం నుంచి వేదాలు వచ్చాయట. వేదాల్లో ఉన్న జ్ఞానం మొత్తం ఓంకారానికి విస్తృత రూపమే! అలా ఆ శంఖాసురుడి నుంచే 'శంఖం' అనే పేరు వచ్చింది.

శంఖనాదంలో అంతరార్థం : దేవదేవుడైన శ్రీకృష్ణ భగవానుడు పూరించే శంఖం పేరు - 'పాంచజన్యం'. చతుర్భుజుడైన విష్ణుమూర్తి చేతుల్లో ఒకదానిలో శంఖం ఉంటుంది. జీవితానికి అత్యంత కీలకమైన చతుర్విధ పురుషార్థాల్లో ఒకటైన 'ధర్మ'నికి అది ప్రతీక. కాబట్టి, శంఖధ్వానం అధర్మం మీద ధర్మం సాధించిన విజయానికి చిహ్నం. మంచి శంఖాన్ని ఎప్పుడైనా మన చెవులకు దగ్గరగా పెట్టుకొని, జాగ్రత్తగా గమనిస్తే, మనకు సాగర ఘోష వినిపిస్తుంది.

అలాగే, శంఖంతో సహా ఇతర మంగళ వాద్యాలతో ధ్వనులు చేయడం వెనుక మరో కీలకం ఉంది. ప్రతికూల వ్యాఖ్యలనూ, శబ్దాలనూ నిర్వీర్యం చేసి, దేవుణ్ణి అర్చిస్తున్న వారికి శుభప్రదమైన ధ్వనులతో సాంత్వన చేకూర్చాలన్నది దీని అంతరార్థం.

పల్లెటూళ్ళు, కుగ్రామాల్లోని ఆలయాల్లో హారతి సమయాల్లో శంఖనాదం చేయడం వల్ల అది అందరికీ వినబడేది. ఆలయానికి వెళ్ళే తీరిక, ఓపిక, అవకాశం లేని వాళ్ళు సైతం క్షణకాలం అన్నీ మరిచి, దైవాన్ని స్మరించుకోవడానికి అది ఓ సూచనగా ఉపకరించేది. తీరిక

లేని జీవితం గడుపుతున్నవారిలో సైతం దైవచింతన బలపడడానికి శంఖారావం తోడ్పడేది.

శంఖనాద ఫలితం : అంతరిక్షం, గ్రహ మండలం, సువర్ణాల సమ్మేళనం శంఖమని 'అథర్వణ వేదం' (4/10) పేర్కొంటోంది. శంఖనాదం శత్రువులను భయభ్రాంతులను చేయడమే కాక, రాక్షసులనూ, దుష్టశక్తులనూ నియంత్రిస్తుంది. అజ్ఞానాన్నీ, బద్ధకాన్నీ, వ్యాధినీ పారద్రోలుతుంది. దీర్ఘాయువును ఇస్తుంది. ఇక,

యస్య శంఖధ్వనిమ్ కుర్యాత్ పూజాకాలే విశేషతః ।
విముక్తః సర్వపాపేన విష్ణునా సహ మోదతే ॥

'పూజా సమయంలో శంఖాన్ని పూరించే వారు అన్ని పాపాల నుంచీ విముక్తులవుతారు, శ్రీమహావిష్ణువు సంతుష్టుడవుతాడు' అని పెద్దల మాట. ❖

(పాంచజన్య ప్రార్థన వచ్చే సంచికలో...)

సుబ్రహ్మణ్యస్వామి లీలా విలాసం

మూలం: కే. అళగరాజా   చిత్రాలు: గోవి   అనుసృజన: స్వామి జ్ఞానదానంద

వీరపాండ్య కట్టబ్రహ్మన, ఆయన పూర్వీకుడైన దిగ్విజయదురై, వడమలైయప్పలనూ, ఉత్తరదేశానికి చెందిన ఒక అంధుణ్ణి ఆదుకున్న సుబ్రహ్మణ్యస్వామి మహత్వం అపారం.




5
17వ శతాబ్దం. తిరుమల నాయకుని పరిపాలనా కాలం. తమిళనాడులో పోర్చుగీసు వారికీ డచ్చి వారికీ మధ్య యుద్ధం జరిగింది. డచ్చివారు తిరుచందూర్ ఆలయాన్ని తమ కార్యాలయంగా మార్చివేశారు.
6
1649వ సంవత్సరం, ఫిబ్రవరి 22. ఆలయాన్ని వదలి బయటకు వెళ్ళమని డచ్చివారితో తిరుమలనాయకుని ప్రతినిధి చెప్పాడు. వారు తిరస్కరించడంతో నాయకుని భటులు భక్తులు కలిసి డచ్చివారితో పోరాడారు.
7
చివరికి డచ్చివారు సుబ్రహ్మణ్యస్వామివీ, నటరాజస్వామివీ, పంచలోహ శిలావిగ్రహాలను కొల్లగొట్టి నౌకలో తీసుకుని వెళ్ళిపోయారు.
8
అప్పుడు హఠాత్తుగా సముద్రంలో భయంకరమైన తుపాను చెలరేగింది.
కెప్టన్, నౌక తుపానులో చిక్కుకుంది. ఇక మనం ఎలా వెళ్ళగలం?
ఇంత భయంకరంగా సముద్రం ఉప్పొంగడం ఇంతవరకూ నేను చూడలేదు!
9
ఒకవేళ, దైవ విగ్రహాల శక్తి వల్లనే మనకు ఈ అగ్ని పరీక్షా?
అవును కెప్టన్, ఈ విగ్రహాల కారణంగానే మనం ఇలా అపాయకరమైన స్థితిలో చిక్కుకున్నాం.
సరే, వెంటనే వీటిని సముద్రంలో విసిరివేయండి.

మిగతా 36వ పేజీలో...

స్వతంత్రులమవుదాం!

– స్వామి స్వసంవేద్యానంద

శిశువు పుట్టగానే ఏడుస్తుంది. తానేదో బంధంలో చిక్కుకున్నానని తలచి దాని నుండి విడివడాలని పెట్టే కేకయే ఆ ఏడ్పు. మనం పుట్టుకతోనే ప్రకృతి విధించే శాసనాలనుండి స్వతంత్రులం కావాలని ఎలుగెత్తి అరుస్తాం. పుట్టుకతోనే మనం ప్రకృతిపై తిరుగుబాటు చేస్తాం. ప్రకృతి శాసనాలకు లోబడి ఉన్నంత కాలం మనం యంత్రాలతో సమానం. ప్రకృతి బంధాలను ఛేదించడం ద్వారానే ఆత్మ స్వాతంత్ర్యం కలుగుతుంది. తెలిసో తెలియకో ప్రతి ఒక్కరూ ఈ ఆత్మస్వాతంత్ర్యం కోసమే పోరాడుతున్నారు. గ్రామంలోని పసిపిల్లలు వేణుగోపాలుని గానంపట్ల ఆకర్షింపబడినట్లు, మనందరం 'స్వాతంత్ర్యం' అనే వాక్కులోని మాధుర్యానికి ఆకర్షింపబడి దాన్ని అనుసరిస్తున్నాము. మనుష్యులు మాత్రమే కాదు సర్వజీవులూ కూడా దాని దిశగా పరుగెడుతున్నాయి. పుణ్యాత్ముడు, పాపాత్ముడు; పండితుడు, పామరుడు; నిస్వార్థపరుడు, స్వార్థపరుడు– ఇలా ప్రతి ఒక్కరూ ఆ గమ్యం వైపే ప్రయాణిస్తున్నారు. ఈ పయనంలో ఒక్కొక్కరి ప్రయత్నం తీవ్రంగానూ, ఒక్కొక్కరి ప్రయత్నం మందంగానూ ఉంటుంది. తీవ్రంగా ప్రయత్నించేవారిని సజ్జనులనీ, మందంగా ప్రయత్నించేవారిని దుర్జనులనీ అంటాం. సాంఘిక జీవనమంతటిలోనూ ఈ స్వాతంత్ర్యం ప్రకటితమవుతూ ఉంటుంది. మన జీవిత వ్యాపారాలూ, ఉద్యమాలూ అన్నీ అందుకోసమే. చిన్న పరిమితిలో స్వాతంత్ర్యం లభిస్తే అవివేకులు తృప్తి చెందుతారు. కానీ వివేకులు నిరపేక్ష స్వాతంత్ర్యం–ఆత్మస్వాతంత్ర్యం లభించే వరకూ తృప్తి చెందరు. ఈ ఆత్మస్వాతంత్ర్యమే మానవుని ఉత్తమోత్తమమైన పరమావధి.

ఈ ఆత్మస్వాతంత్ర్యాన్ని పొందే ముందు వివేకవైరాగ్యాదుల ద్వారా ఇంద్రియ స్వాతంత్ర్యాన్నీ, మనో స్వాతంత్ర్యాన్నీ పొందేందుకు ప్రయత్నించాలి.

ఇంద్రియ స్వాతంత్ర్యం: ఇంద్రియాలకు గోచరమైన వాటిని మాత్రమే విశ్వసించి అంగీకరించేవాడు శారీరకంగా బద్ధుడై ఉంటాడు. అలాంటివారికి శరీరమే సర్వస్వం. విషయ సుఖమే జీవిత గమ్యమని తలుస్తాడు. ఇలాంటి వ్యక్తులు భౌతిక సుఖాల్ని పొందగలిగితే వారు పూర్తిగా స్వతంత్రులై హాయిగా జీవిస్తున్నామని భావిస్తారు. ఇంద్రియ భోగాలను అతిగా అనుభవిస్తున్నవారు ప్రతిరోజూ క్రొత్త క్రొత్త సుఖాలకై ఆరాటపడతారు. క్షణకాలపు ఇంద్రియసుఖాలకై ప్రతిరోజూ ఎన్నెన్నో విచిత్రమైన వస్తువులను కనుగొనుటలో అత్యంత విలువైన తమ సమయాన్నీ శక్తి సామర్థ్యాలనూ వృథా పరుస్తున్నామని వారు గ్రహించలేరు. విషయ సుఖాలన్నీ నిస్సారమని తెలియని అవివేకులు అనేక కష్టనష్టాల పాలవుతారు. అందుకే కఠోపనిషత్తులో యమధర్మరాజు మానవలోకంలో విషయసుఖాలకై అతిదుర్లభమైనటువంటి అప్సరాదులను గ్రైకొను... అంటూ నచికేతుని ప్రలోభ పెట్టినప్పుడు, వివేకవంతుడైన నచికేతుడు *శ్వోభావామర్త్య స్య యదంతకైతత్ సర్వేంద్రియాణాం జరయంతి తేజః (కఠ 1-1-28)* "ఓ మృత్యుదేవా! నీవు నాకిస్తానని చెప్పిన విషయ భోగాలు శాశ్వతం కావు. అవి రేపటికి ఉంటాయో, ఉండవో? అని సందేహించాల్సినవి. ఇంతేగాక, ఈ భోగాలు మనిషికి గల సకలేంద్రియ సారాన్నీ హరింపజేస్తాయి" అన్నాడు. భౌతిక సుఖాలకు మనం వశులమైతే అవి మనకు అనేక అనర్థాలను కలిగిస్తాయి. వివేకవంతుడు నచికేతుడు చెప్పినట్లు విషయ సుఖాలు నిస్సారమని గ్రహించి వాటి బంధాలనుండి స్వాతంత్ర్యాన్ని కోరుతాడు.

మనో స్వాతంత్ర్యం: మనిషి కేవలం శరీరం, ఇంద్రియాలు మాత్రమే కాదు అని గ్రహిస్తే శారీరక బంధాలను అధిగమించి మానసిక పరిణతికి ప్రాధాన్యతనివ్వగలడు. అన్ని రంగాలలో ప్రగతిని సాధించినా ఈ ప్రగతి అంతా అనాత్మవిషయానికి సంబంధించినది. వీటి ఫలితం క్షణికం. మనస్సు అనేక కార్యాలద్వారా బహిర్గతమవుతుంది. విషయాసక్తి, సంకల్పం,

కామం (కోరిక), క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం, సంశయం, శ్రద్ధ, అశ్రద్ధ, స్థిరత్వం, అస్థిరత్వం, లజ్జ, వివేకం, అవివేకం, భయం, దంబం, అహంకారం మొదలైనవి మనస్సుయొక్క కార్యాలు. ఆత్మస్వాతంత్ర్యాన్ని పొందటానికి మనస్సు అత్యంత విలువైన పరికరం. పవిత్ర మనస్సు ద్వారానే ఆత్మజ్ఞానం, ఆత్మప్రాప్తి సాధ్యమవుతాయి. మనస్సు యొక్క

కార్యాలలో అత్యంత ప్రధానమైనవి కామం, క్రోధం. వీటిని నియంత్రించి మనస్సును దానికంటే శ్రేష్ఠమైన ఆత్మయందు ప్రతిష్ఠింపచెయ్యాలి. అలా చేయకుంటే ఇవి మనిషిని ఇంద్రియాలకు బానిసగా చేసి అధోగతిపాలు చేస్తాయి. దృశ్యవస్తువును గూర్చి మనిషి చింతంచడం మొదలుపెడితే ఆ వస్తువుతో మనస్సుకి ఒక విధమైన సంబంధం ఏర్పడుతుంది. ఆ సంబంధం మనస్సులో దానికనుగుణమైన వాసనను మేల్కొల్పడం వల్ల అది కోరికగా మారుతుంది. కోరిన వస్తువును పొందడానికి ప్రయత్నం జరుగుతుంది. ఆ ప్రయత్నంలో ఎవరైనా, ఏదైనా అడ్డుతగిలితే క్రోధం పుడుతుంది. తద్వారా చిత్తం వికల్పమై ఏది హితం, ఏది అహితం అనే వివేకం లోపిస్తుంది. దీనినే మోహం అంటారు. ఆ మోహం వలన స్మృతి (జ్ఞాపకశక్తి) నశిస్తుంది. అంటే తానెవరో, తన లక్ష్యం ఏమిటో అనే విషయాన్ని విస్మరించడం జరుగుతుంది. అలా స్మృతిభ్రంశం కలిగినపుడు, లక్ష్య భ్రష్టుడైనపుడు మనిషిలో నిశ్చయాత్మికా బుద్ధి (నేను ఇది చేస్తాను, ఇది నా లక్ష్యం అనే నిర్ణయం తీసుకోగల సామర్థ్యం) నశిస్తుంది. అలాంటి బుద్ధి నశించినపుడు మనిషి అధః పతనం చెందుతాడు.

అయితే మనస్సులోని ఈ కామక్రోధాది శత్రువులను జయించి మనస్సును భగవంతుని యందు నిలిపి ఆత్మ స్వాతంత్ర్యాన్ని పొందడమెలాగో శ్రీరామకృష్ణదేవులు చక్కటి ఉపాయాన్ని మనకు ఇలా బోధిస్తున్నారు: “కామక్రోధాది శత్రువులు వదలిపోవు కాబట్టి వాటి దిశను మార్చివేయండి, ప్రాపంచిక సుఖాలను కోరుకొనే బదులు భగవంతుణ్ణి కోరుకోవాలి. భగవంతుడి రూపాన్ని మోహించు. అహంకారం నిలుపుకోవాలంటే ‘నేను భగవంతుడి దాసుడను’ ‘నేను భగవంతుడి బిడ్డను’ అనే అహంకారం కలిగిఉండు. ఈ విధంగా ఆరుగురు శత్రువుల దిశను భగవంతుడివైపుకు మరల్చాలి.” ఈ ఉపాయాన్ని అమలుపరచి మనస్సును ఆత్మపైన నిలుపడానికి ప్రయత్నించాలి.

ఆత్మస్వాతంత్ర్యం: అనేక జన్మార్జితాలైన సంస్కారాలు ఘనీభవించి వాసనారూపంగా చిత్తంలో దృఢపడి ఉంటాయి. ఇంద్రియాలకు శబ్దాది విషయాలు ఆహారం. కనుక ఇంద్రియాలు ఎప్పుడూ మనస్సును బయటికి లాగుతూ ఉంటాయి. మనస్సును వెలుపలికి వెళ్ళనివ్వకుండా నిగ్రహించాలి. అప్పుడే మనస్సు ఆత్మయందు స్థిరంగా నెలకొనగలదు. ఈ సత్యాన్ని పతంజలి మహర్షి “యోగః చిత్త వృత్తినిరోధః; తదాద్రష్టుః స్వరూపేఽవస్థానమ్” (సమాధి పాదము) అనే రెండు సూత్రాల ద్వారా వ్యక్తపరిచాడు. ఎప్పుడు చిత్తం (మనస్సు) విషయ ప్రవృత్తులను త్యజించి, అంతర్ముఖమవుతుందో అప్పుడు మనం మన స్వరూపాన్ని కనుగొంటాం. ఆత్మ స్వరూపులమై ఉంటాం.

విషయాల అనిత్యత్వాన్నీ ఆత్మయొక్క శాశ్వతత్వ, ఆనందత్వాలనీ బాగా తెలుసుకుంటే విషయాలపట్ల ప్రీతి, రాగం క్రమంగా తగ్గుతూ వాసన సన్నగిల్లి చివరికి నశిస్తాయి. ధూళితో కప్పబడి ఉన్న వజ్రాన్ని శుద్ధిచేస్తే ఎలా ప్రకాశిస్తుందో, అలాగే విషయవాసన అనే ధూళిని ఆత్మనుండి తొలగిస్తే మనిషి స్వస్వరూపం ప్రకాశిస్తుంది. ఈ స్వస్వరూపానుసంధానమే ‘ఆత్మస్వాతంత్ర్యం’. ❖

ఓ మహాత్యాగి ఆత్మకథ

(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

త్యాగేనైకే అమృతత్వ మానశుః అంటుంది వేదం. త్యాగం వల్లనే అమృతత్వం, మోక్షం సాధ్యం. ప్రపంచాన్ని, సంసారాన్ని త్యాగం చేసి అడవులకో, పర్వతగుహలకో, హిమాలయాలకో వెళ్ళి కఠోర తపోనిష్ఠలో ధ్యానమగ్నులై ఆత్మసాక్షాత్కారం పొంది, బ్రహ్మానందంలో మునిగి ఉండడమే తరతరాలుగా వస్తున్న సాంప్రదాయక సన్న్యాసం. సప్తర్షిమండలంలో, బ్రహ్మానంద సుఖంలో మునిగి ఉన్న స్వామీజీ విశ్వమానవ శ్రేయస్సుకై స్వీయ బ్రహ్మానంద సుఖాన్నే త్యాగం చేసి "త్యాగం" అనే పదానికే సరికొత్త, సర్వశ్రేష్ఠ నిర్వచనమిచ్చారు. స్వామి వివేకానంద కన్నా 'మహాత్యాగి' ఎవరుంటారు?

ఆ మహాపురుషుడు తాను కావాలనుకుంటే మహాపండితుడుగా, గొప్పవక్తగా, నేతగా మహారాజుగా కోటీశ్వరుడై పేరు ప్రతిష్ఠలు, భోగ భాగ్యాలతో తులతూగుతూ ఒక మహా చక్రవర్తిగా గడిపి ఉండవచ్చు!. కానీ ఈ తుచ్ఛ, అశాశ్వత భోగభాగ్యాలు, పేరు ప్రతిష్ఠలు, మూన్నాళ్ళ ముచ్చట్లుగా భావించి గడ్డిపోచలుగా త్యాగం చేశారు. ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తిగా, తన భౌతిక శరీరంలో కేవలం 39 1/2 సంవత్సరాలే జీవించినా, విశ్వమానవ హృదయాలలో 39 యుగాలేమిటి, సూర్య చంద్రులుండేంత వరకూ శాశ్వతంగా జీవిస్తున్న జాజ్వల్య తేజోపుంజం. ఆధునిక విశ్వచింతనా శైలిని ఘోర భౌతిక భోగవాదం నుండి ఆధ్యాత్మిక చైతన్యం వైపు మలుపుతిప్పిన మహావీరుడు, మహాత్ముడు స్వామి వివేకానంద.

మహా భక్తుడు, అద్వైత వేదాంతి, కర్మయోగి, ప్రవక్త, శ్రేష్ఠసన్న్యాసి, గురువు, యుగాచార్యుడు, దేవదూత, పరమహంస శిష్యుడు, మానవ జాతి ప్రేమికుడు, మహా దేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, మహాయోగి, గంధర్వగాయకుడు ఇలా విభిన్న రూపాలలో స్వామి వివేకానంద మనకు దర్శనమిస్తారు. స్వామీజీ సంభాషణలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, లేఖల్లో స్వయంగా తెలిపిన తన జీవితానుభవాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు ఈ నెల నుంచి ధారావాహికగా అందిస్తున్నాం.

స్వీయ విముక్తి (మోక్షం) కోసం, పరుల సుఖశ్రేయస్సుల కోసం, సన్న్యాసి ఈ లోకంలో జన్మిస్తాడు. తన జీవితాన్ని మానవాళి సేవలో సమర్పించడానికీ, కోట్లాది దీన దుఃఖితుల ఆర్తనాదాలకు స్పందించి వారిని ఆదుకోవడానికీ, వితంతువుల కన్నీటిని తుడవడానికీ, పుత్రశోకంతో తల్లడిల్లుతున్న తల్లి హృదయాన్ని ఓదార్చడానికీ, అజ్ఞానం, నిరాశా, నిస్పృహలతో క్రుంగిపోయిన బీదలకు జీవనోపాధిని కల్పించి వారిని తమ కాళ్ళమీద తాము నిలబడేటట్లు చేయడానికీ, వేదాలు, శాస్త్రాల సందేశాన్ని భేద బుద్ధి లేకుండా అందరికీ బోధించి వారి భౌతిక, ఆధ్యాత్మిక వికాసానికి తోడ్పడటానికీ 'ఆత్మజ్ఞాన జ్యోతి'ని వెలిగించి సకల జీవుల హృదయాలలో నిద్రాణమై ఉన్న 'బ్రహ్మ' సింహాన్ని జాగృతం చేయడానికీ, దీనికి... దీనికే సన్న్యాసి ఈ లోకంలో జన్మిస్తాడు. ఈ లక్ష్యసాధన కోసమే మేము (సన్న్యాసులం) జన్మనెత్తాం; దీనికోసమే మా జీవితమంతా ఆహుతిచేస్తాం.

తల్లి ఋణం తీర్చలేనిది : నా తల్లితండ్రులు సంతానం కోసం ఎన్నో ఏళ్ళపాటు ఉపవాసాలు, వ్రతాలు, ప్రార్థనలు చేశారు. నేను పుట్టక ముందు నా తల్లి ఉపవాసాలూ, ప్రార్థనలూ, ఎన్నెన్నో కఠోర వ్రతాలూ చేసింది. వాటిని నేను 5 నిముషాలు కూడా చేయలేను! రెండేళ్ళపాటు ఆమె ఇవన్నీ చేసింది! నాలో ఉన్న

ఆధ్యాత్మిక సంస్కారాలు, సంపద అంతా ఆమె సాధనల ఫలమే అని నా దృఢ విశ్వాసం! నా తల్లి ప్రేరణ, పెంపకమే నన్నింత వాణ్ణి చేసింది! నాకున్న సద్గుణాలన్నీ ఆ తల్లి అనుగ్రహమే! ఎంతో ఓర్పునేర్పుతో ఆమె నన్ను పెంచి పెద్ద చేసింది. ఆమె మాతృప్రేమే నన్ను గొప్పవాణ్ణి చేసింది. నా తల్లి ఋణం నేనెన్నటికీ తీర్చుకోలేను! ఎన్నోసార్లు మా అమ్మ మధ్యాహ్నం రెండు గంటలప్పుడు భోజనం చేయడం చూశాను. మేమంతా 10 గంటలకు భోజనంచేస్తే ఆమె మాకు తినిపించి, ఇంటి పనులన్నీ చూసుకుని 2 గంటలకు తినేది. ఎవరయినా అతిథులు వస్తే తనకోసం మిగిలిన అన్నం కూడా వారికి ఎంతో ప్రేమతో పెట్టి తాను తర్వాత ఏదో వండుకుని తినేది. అలాంటి త్యాగమయ జీవితం ఆమెది! ఇవన్నీ కూడా ఆమె చిరునవ్వుతో సంతోషంగా చేసేది. అందువల్లనే భారతదేశంలో మనం తల్లిని దైవంగా (మాతృదేవోభవ) పూజిస్తాం!

ప్రశాంతతనిచ్చే పరమశివుని నామం: రెండేళ్ళ చిరుప్రాయంలోనే నేను బూడిద పూసుకుని, కౌపీనధారినై నా మిత్రులతో 'బైరాగి'గా ఆడుకునేవాణ్ణి. సాధు, బైరాగులంటే మహా అభిమానం! వారు మా ఇంటికి భిక్షకోసం వస్తే ఇంట్లోని వస్తువులన్నీ దానం చేసేస్తానని మా అమ్మ నన్ను మేడ మీద గదిలో ఉంచి తాళం వేసేసేది! అయినా నేను (నరేంద్రుడు) మేడ మీద కిటికీలోంచి వస్త్రమో, ఏదో ఒక వస్తువో సాధువులకు ఇచ్చేవాణ్ణి! కైలాసంలో ఏదో అల్లరిపని చేసినందువల్ల నన్ను శివుడు తనకు దూరంగా పంపేశాడని మా ఇంట్లో వాళ్ళు అనేవారు. నేనూ నమ్మేవాణ్ణి! నేను అతిగా అల్లరి చేసినప్పుడు మా అమ్మ "శివా, శివా! ఎంతో తపస్సూ, నోములూ చేసి నీలాంటి ఒక మంచి పుత్రుణ్ణి ఇవ్వు స్వామీ! అని ప్రార్థిస్తే ఆ శివుడు తన దగ్గరున్న ఈ భూతాన్ని పంపేశాడు. నా ఖర్మ!" అని వాపోయేది! నా అల్లరి శ్రుతిమించినపుడు మా అమ్మ చన్నీళ్ళు నా తలపై 'శివా, శివా' అంటూ గుమ్మరించేది! నేనూ శాంతంగా మారేవాణ్ణి. ఇప్పటికీ (పెద్దవాణ్ణయినా), అలజడిగా అనిపిస్తే ఆ "శివ, శివ" నామమే నన్ను శాంత పరుస్తుంది!.

ప్రకృతిమాత ఒడిలో పారవశ్యస్థితి : నాకు (నరేంద్రనాథ్) 14 ఏళ్ళ వయస్సులో మా తండ్రి ఉద్యోగరీత్యా మధ్యప్రదేశ్‌లోని రాయపూర్‌కు వెళ్ళారు. అప్పట్లో రైలు సౌకర్యాలు అంతగాలేనందున ఎడ్ల బళ్ళల్లోనే కొంత భాగం ప్రయాణం సాగింది. రాయపూర్ వెళ్ళే అడవి దారిలో నేను చూసిన ప్రకృతి దృశ్యాలూ, అనుభూతులూ... ముఖ్యంగా ఓ నాటి అద్భుత సంఘటన నాకు మరుపురానిది. ఆ రోజు మేము వింధ్య పర్వతశ్రేణుల పాదాల దగ్గర ప్రయాణిస్తున్నాము. ఆ పర్వత శిఖరాలు దారికి ఇరువైపులా చాలా ఎత్తుగా నింగికెగిసాయి. రకరకాల వృక్షాలు, లతలు వాటి రంగురంగుల పువ్వులు, ఫలాల భారంతో వంగిపోయాయి, ఆ పర్వత శ్రేణుల మధ్య అద్భుత ప్రకృతి సౌందర్యాన్ని కురిపిస్తున్నాయి! రంగురంగుల పక్షులు చెట్టు నుండి చెట్టుకు ఎగురుతూ ఆ ప్రాంతాన్ని మధురమైన తమ కిలకిలారావాలతో నింపేశాయి!.. ఇదంతా చూస్తున్న నాకు ఓ అనిర్వచనీయ ప్రశాంతత కలిగింది. ఎడ్లబండి మెల్లగా సాగుతుండగా హఠాత్తుగా ఆ అడవి మార్గంలో ఓ చోట దారికిరువైపులా ఉన్న రెండు పర్వత శిఖరాలు ముందుకు వంగి, పెనవేసుకున్నట్లుగా కనిపించాయి. ఆ రెండు పర్వత శిఖరాలు కలిసే ప్రదేశాన్ని జాగ్రత్తగా గమనిస్తే ఒక వైపు పర్వత శిఖరం నుండి కొండ క్రిందవరకూ పెద్ద చీలిక కనిపించింది. ఆ చీలికను నింపివేస్తూ, ఒక పెద్ద తేనె పట్టు వ్రేలాడుతూ ఉంది! ముల్లోకాధిపతి ఆ పరమాత్ముని అనంత సృష్టి, శక్తి వైభవం గురించి గాఢంగా తలపోస్తూ, బాహ్యస్మృతిని పూర్తిగా కోల్పోయాను. ఎంతసేపు ఆ ఎడ్లబండిలో ఆ అద్భుత పారవశ్యస్థితిలో ఉన్నానో నాకు గుర్తులేదు! బాహ్యస్మృతి కలిగాక ఆ ప్రదేశం నుండి చాలా దూరం వచ్చేశామని తెలుసుకున్నాను.

సేవా ఫలం: ఈ ప్రపంచంలో చాలా దుఃఖం ఉందనే సత్యాన్ని కాదనలేం; మరి మనమేం చేయాలి? శాయశక్తులా ఇతరులకు సహాయం చేయడమే మనం చేయగలిగిన ఉత్తమ కార్యం. అలా చేయడం వల్ల మనకు మనం మేలు చేసుకోవడమేనని గ్రహిస్తాం. నా బాల్యంలో నావద్ద కొన్ని తెల్ల ఎలుకలుండేవి. వాటిని ఒక్క చిన్న పెట్టెలో ఉంచాం, అందులో చిన్న చిన్న చక్రాలున్నాయి; ఎలుకలు ఆ చక్రాలను దాటడానికి ప్రయత్నిస్తే, ఆ చక్రాలు ఇంకా వేగంగా తిరిగేవి. దాంతో ఆఖరికి ఆ ఎలుకలు ఎక్కడున్నవి అక్కడే ఉండిపోయేవి! ఈ ప్రపంచమూ, మనం దానికి చేసే సహాయమూ అలాంటిదే! ఈ సేవా ప్రక్రియ ద్వారా మనకు కలిగే ఫలితమేమిటంటే మనం నైతికంగా బలవంతులమవుతాం! ❖ సశేషం

అనుసృజన :
స్వామి అర్చనానంద



ప్రయత్నమంతా ప్రశాంతత కోసమేనా!

– ఆకెళ్ల రాఘవేంద్ర

సుఖానికి పొంగిపోకుండా, దుఃఖానికి కుంగిపోకుండా ఎవరైనా ఉండగలరా? దాదాపు ఎవ్వరూ ఉండలేరనే చెప్పవచ్చు. ఎందుకంటే మనం మానవులం. రాగద్వేషాలకు అతీతంగా ఉండగలగడం సామాన్యమైన విషయం కాదు. బాధ, కోపం, అసహనం, శోకం, భయం, ప్రేమ, మోహం... లాంటి మానసిక చాంచల్యాలేమీ లేకుండా బతకడం మాటలు కాదు. అయితే తీవ్రమైన భావోద్వేగాలు కలిగి ఉండడం మాత్రం మంచిది కాదు. శ్రుతి మించిన భావావేశం వల్ల మానసిక స్థితే కాదు శారీరక ఆరోగ్యమూ దెబ్బతింటుందని ఆధునిక వైద్యశాస్త్రం చెబుతోంది. ఒకప్పుడు మేధస్సును ప్రమాణంగా స్వీకరిస్తూ ఇంటిలిజెన్స్ కోషంట్ (ఐ.క్యూ) గురించి ఆలోచించేవాళ్ళం. కానీ నేడు ఎమోషనల్ కోషంట్ గురించి ఆధునిక మేనేజ్‌మెంట్ సూత్రాలు చెబుతున్నాయి. మనోనియంత్రణ ఎంతటి ప్రాధాన్యం సంతరించుకొందో దాన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

ఎలాంటి పరిస్థితులలోనయినా తీవ్రభావోద్వేగానికి గురి కాకుండా ఉండాలంటే ఏం చేయాలి? పురాణ సాహిత్యంలో ఇందుకు సంబంధించిన కథలు అనేకం ఉన్నాయి. వాటిలో అజగరుడు అనే మునికి సంబంధించిన ఉపాఖ్యానం ఒకటి. ఇది పోతన భాగవతం సప్తమస్కంధంలో 'ప్రహ్లాద అజగర సంవాదం' అనే పేరుతో ఉంది. ఒత్తిళ్ళకు నిలయమైన ఆధునిక జీవనంలో భావోద్వేగాలను అదుపులో ఉంచుకొని మానసిక ప్రశాంతతను పొందే జీవన విధానాన్ని అందించే కథ ఇది.

ఒకసారి ప్రహ్లాదుడు లౌకిక తత్త్వం తెలుసుకోవాలని లోకసంచారం చేయడం మొదలుపెట్టాడు. అలా ప్రయాణిస్తూ కావేరీ నదీ తీరానికి చేరుకొన్నాడు. అక్కడ ఒళ్ళంతా దుమ్ము కొట్టుకు పోయి ఉన్న అజగరుడు అనే ముని కనిపించాడు దేహమంతా ధూళిధూసరాలతో నిండి ఉన్నప్పటికీ ఆ ముని కళ్ళల్లో, మోములో... మొత్తంగా శరీరంలో అద్భుతమైన తేజస్సు ఉంది. మరో విశేషం – ఆ ముని కొండ చిలువలాగ నిర్వికారంగా నేలపై పడుకొని ఉన్నాడు.

దీన్ని గమనించి ఆశ్చర్యంతో ప్రహ్లాదుడు ఆ మునిని ఈ విషయమే అడిగాడు–

"లోకంలో ప్రయత్నించిన వారికే కానీ ఇతరులకు సంపద లభించదు. సంపద ఉంటేనే కానీ పోషణ సాధ్యం కాదు. పోషణ ఉంటేనేకానీ శరీరపుష్టి, తేజస్సు సాధ్యం కాదు. కానీ ఎటువంటి ప్రయత్నం లేకుండానే, ధన భోగాలు లేకుండానే కటిక రాతి నేలపై పడుకొని నిద్రించే మీకు ఇంతటి అసమాన తేజోమయ దేహం ఎలా వచ్చింది?"

ప్రహ్లాదుడి ప్రశ్నకు అజగరుడు చిన్న మందహాసం చేశాడు. సృష్టిని లోతుగా పరిశీలించిన అనుభవంతో ఆ ముని ఇలా జవాబిచ్చాడు:

"నేను కూడా మొదట్లో దురాశ వెంటపడిన వాడినే నాయనా, కర్మబంధాల్లో చిక్కుకొని సంసార చక్రంలో తిరిగిన వాణ్ణే. అందుకే సుఖాలకు పొంగిపోయేవాణ్ణి; దుఃఖాలకు కుంగిపోయేవాణ్ణి. బాధకూ, ఆనందానికీ, కోపానికీ, ఆవేశానికీ అన్నింటికీ లోబడే ఉండేవాణ్ణి. కానీ చివరకు సమస్త క్రియల నుండీ నివృత్తి పొందిన జీవుడు స్వతంత్రుడై ప్రకాశిస్తాడని తెలుసుకొన్నాను. అంటే దుఃఖమైనా, సుఖమైనా, బాధ అయినా, ఆనందమైనా – దేన్నయినా సమానంగా స్వీకరించే స్థితికి చేరుకొన్నాను. ప్రయత్నం లేని, కోరిక లేని నిర్వికల్ప స్థితికి చేరుకొన్నాను. అలాగని జీవించకపోవడం కాదు. తామరాకుపై నీటి బొట్టులా జీవనాన్ని సాగిస్తున్నాను. ఒక్కమాటలో చెప్పాలంటే – మానుషతత్త్వం నుంచి బయటపడి మునితత్త్వాన్ని పొందాను".

అజగరుడు కాసేపు ఆగి మళ్ళీ ఇలా అన్నాడు:

"అజగరమును జుంటీగయు నిజ గురువులుగా దలచి నిశ్చింతుడనై,
విజనస్థలి కర్మంబుల, గజిబిజి లేకున్నవాడ గౌరవ వృత్తిన్"

అంటే– "అజగరము (కొండచిలువ), తేనెటీగ – ఈ రెండూ నాకు గురువులు. వీటి నుంచి జీవితానికి కావలసిన గుణపాఠాన్ని నేర్చుకొని నేను జీవితంలో గజిబిజి లేకుండా బతుకుతున్నాను".

తేనెటీగ నుంచి నేర్చుకొనే జీవితతత్త్వం: తేనెటీగ ఎంతో శ్రమపడి, ఎన్నెన్నో ప్రదేశాలు తిరిగి.. తిరిగి... ఒక్కో తేనెబొట్టునూ సేకరిస్తుంది. నిరంతరం అదే పరిశ్రమలో ఉంటుంది. కష్టపడే గుణాన్ని దీని నుంచి నేర్చుకోవచ్చు. కానీ అజగరుడు చెబుతున్న తత్త్వం అది కాదు. తేనెటీగ అంతలా శ్రమిస్తుంది. జీవితమంతా కష్టపడి తేనెపట్టు కడుతుంది. ఎన్నో వేల మైళ్ళు తిరిగి ఇదంతా సాధిస్తుంది. కానీ ఏం లాభం? తాను సముపార్జించిన మకరందాన్ని తేనెటీగ ఏనాడైనా ఆస్వాదించిందా? జీవితాన్ని గందరగోళ పరచుకొని, సంపాదన వెనక పరుగులు పెడుతూ – బతుకును వెళ్ళదీసే తత్త్వంపై విమర్శ ఇందులో కనిపిస్తుంది.

మనిషి యంత్రం కాదు, కాకూడదు. అనుక్షణం ఒత్తిడితో సావాసం చేయకూడదు. ప్రతీ క్షణం ఏదో 'కూడబెట్టాలన్న' వ్యర్థ తాపత్రయంతో మసలకూడదు. దీనివల్ల అనవసర

కోరికలు, ఆ కోరికల్ని తీర్చుకొనేందుకు ప్రయాస, తద్వారా యంత్రంగా మారిపోయిన మనిషి జీవనం, ఈ కారణంగా తలెత్తే భావోద్వేగాలు... ఇలా సాగిపోతోంది నేటి మానవ జీవితం.

జీవితం లభించేది ఒక్కసారే! మళ్ళీ మళ్ళీ వచ్చేది కాదు. ఆచితూస్తే జీవితం అల్పమైంది. తూచి చూస్తే బహు స్వల్పమైంది. ఇంత చిన్న జీవితాన్ని అనవసర భావోద్వేగాలతో – కోపంతో, తాపంతో, ఆవేశంతో – మరింత కుదించు కొనే ప్రయత్నం చేయడం తప్పు కాదా? మనిషి జీవితానికి పరమార్థం ఉండాలి కదా. అందుకనే వయసుకు తగ్గ కార్యకలాపాలను చేస్తూ మొత్తంగా మానవ జీవితాన్ని ఒక అందమైన వనంలా తీర్చిదిద్దుకునే సూత్రాన్ని ప్రాచీన వాఙ్మయం అందించింది. బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్న్యాసం–అంటూ చతుర్విధ ఆశ్రమాల ద్వారా చతుర్విధ పురుషార్థాలను సాధించాలని చెప్పింది.

కొండచిలువ నుంచి అజగరుడు నేర్చుకొన్నదేమిటి?: ఎన్నెన్నో పాట్లుపడి సంపాదన కోసం అగచాట్లు పడే జీవి తేనెటీగ కాగా – ఆహారం కోసం ఎక్కడికీ తిరగకుండా, ప్రాప్తించిన ఆహారాన్ని మాత్రం తీసుకొంటూ – దీర్ఘకాలం బతికేది – కొండచిలువ.

దీనిని దృష్టిలో పెట్టుకొని అజగరుడు ఇలా అంటాడు – "నేను ఏది లభిస్తే అది ధరిస్తాను. ఏదీ లభించకపోతే దిగంబరంగా ఉంటాను. కట్టుకొన్నాననే సంతోషం కానీ, లేదే అనే బాధ కానీ పొందను. పల్లకీల మీదగానీ, రథాల మీద కానీ, అశ్వాలమీద కానీ, ఏనుగులమీద కానీ ప్రయాణం చేయగలను, లేదా ఏదీ లేకుండా కాలి నడకన వెళ్ళిపోగలను. కస్తూరి, చందనం లాంటివి శరీరానికి పూసుకొని ఆనందిచనూ గలను, లేదా దుమ్మును ఒంటికి పూసుకోనూగలను. బంగారు తల్పాలపై శయనించనూగలను. రాయిరప్పలమీద, బూడిద నేలలో ఎక్కడైనా సరే నిశ్చింతగా నిద్రపోనూ గలను. ఎవరైనా గౌరవిస్తే గర్వపడను. అవమాన పరిస్తే ఆందోళన చెందను. ఏది లభిస్తే దాన్నే భుజిస్తాను. అది తియ్యగా ఉండొచ్చు. కటిక చేదుగా ఉండొచ్చు. ఏదీ లభించకపోయినా అలాగే ఉండిపోనూ గలను. మనసులో దేనిని గురించీ ఆలోచించను. ఏదీ మానను. ఏదీ కోరను. ద్వేషం లేదు, అలాగని ప్రేమా లేదు. సుఖం లేదు, దుఃఖం లేదు. ఒకరిని నిందించను, ఒకరిని స్తుతించను. ఎన్ని సంపదలు వచ్చినా ఆనందపడను. ఎన్ని కష్టాలు వచ్చినా బాధపడను".

అజగరుడు పలికిన పలుకుల్లో – స్థూలంగా చూస్తే – మెట్టవేదాంతం కనిపిస్తుంది. ఏ భావమూ లేకుండా ఉంటే మనిషికీ మానుకీ తేడా ఏముంటుంది అనిపిస్తుంది? కానీ సూక్ష్మ దృష్టితో చూస్తే– మానవుడు చేయాల్సిన ప్రయత్నం చేస్తూనే అందిన ఫలాల్ని అందుకొంటూనే తీవ్రభావోద్వేగాలకు లోను కాకుండా ప్రశాంతంగా జీవించడం అనే సత్యం–ఈ మాటల వెనుక దాగి ఉంది. మనసుపై ఏ ప్రభావమూ లేని జీవన విధానాన్ని అలవరచు కోవాలన్న సూత్రం ఇమిడి ఉంది. ❖

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

శీలా కోటేశ్వరరావు, కొత్తవలస, విజయనగరం జిల్లా.

ప్రశ్న: నేను ఒక కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నాను. నేటి విద్యావిధానం స్వామి వివేకానంద ఆశించిన విధంగా లేదు. అందువల్ల విద్యార్థుల్లో నైతిక, ఆధ్యాత్మిక విలువలు కొరవడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నాలాంటి అధ్యాపకులు అనుసరించాల్సిన పద్ధతులను తెలుపండి.

జవాబు: ఏ దేశమైనా సుస్థిరంగా, సుసంపన్నంగా ఉండాలంటే ఏమిటి చేయాలి అని ఒకసారి రఘు మహారాజు సభలో చర్చసాగింది. ఆ సభలో 'దేశంలోని ప్రజలు ఎలాంటి భయమూ లేకుండా ఆనందంగా ఉండాలంటే శత్రుదేశాల బారి నుంచి రక్షించుకునేందుకు సైన్యాన్ని బలోపేతం చేయాలి. దానివల్ల దేశానికి పటిష్ఠమైన భద్రత ఏర్పడుతుంది' అని కొంతమంది సలహా ఇచ్చారు.

'ప్రజల్ని విలువలతోకూడిన వ్యక్తులుగా తీర్చిదిద్దిన నాడు సుఖసంతోషాలు సర్వత్రా తాండవిస్తాయి. శీలవంతుడైన ప్రతి పౌరుడూ దేశానికి ఓ కోటలాంటివాడు' అని రెండో వర్గం వారు సలహా ఇచ్చారు. పౌరుల్ని శీలవంతులుగా సంస్కరించడం వల్లనే దేశం సుస్థిరంగానూ, సుసంపన్నంగానూ ఉంటుందని రఘు మహారాజు విశ్వసించాడు. శీలవంతులుగా తీర్చిదిద్దే విలువలతో కూడిన విద్యే అత్యంత అవసరమని దీన్ని బట్టి మనకు అర్థమవుతుంది.

ఆధ్యాత్మిక విలువలులేని లౌకిక విద్య వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు అన్న స్వామి వివేకానందుని సందేశాన్ని నేటి మన విద్యాసంస్థలూ, ప్రభుత్వం, అధ్యాపకులూ అర్థం చేసుకొని ఆచరించాల్సిన సమయం ఆసన్నమైంది.

...If you attempt to get the secular knowledge without religion, I tell you plainly, vain is your attempt in India, it will never have a hold on the people.

- Swami Vivekananda

శీలనిర్మాణం, మనోబలం, విశాల దృక్పథాలను పెంచే విద్యే నేడు మనకు కావలసిన విద్య అని స్వామి వివేకానంద చెప్పారు. ఎప్పుడైతే మన విద్యా విధానంలో స్వామీజీ ఆశించిన విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యతను ఇస్తామో అప్పుడు మాత్రమే యువత నైతికంగానూ, ఆధ్యాత్మికంగానూ పరిపుష్టులవుతారు.

అబ్రహాం లింకన్ తన కుమారుడికి ఎలాంటి విద్య బోధించాలో వివరిస్తూ కళాశాల అధ్యాపకునికి కొన్ని సూచనలతో ఒక ఉత్తరం వ్రాశాడు. అందులో కొన్ని:

1. మోసం చేసి విజయం సాధించడం వల్ల వచ్చే కీర్తి ప్రతిష్ఠల కన్నా అపజయం పొందినప్పటికీ నిజాయతీగా వ్యవహరించడం ఉత్తమమని బోధించండి.
2. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా మనోదుర్బలతకు గురికాకుండా ఆత్మవిశ్వాసం కలిగి ఉండేలా బోధించండి.
3. బుద్ధిబలాన్ని ఉపయోగించి ధనార్జన చేయవచ్చు కానీ లోభత్వం వల్ల స్వార్థపరుడై తన వ్యక్తిత్వాన్ని కోల్పోయేలా వ్యవహరించ వద్దని బోధించండి.

స్వామి వివేకానంద ఆశించిన విలువలు–శీలనిర్మాణం, మనోబలం, విశాల దృక్పథం అనే మూడు అంశాలను అబ్రహాం లింకన్ కూడా తన ఉత్తరంలో పొందుపరచడం గమనార్హం.

ప్రతి అధ్యాపకుడూ విద్యార్థులకు ఇతర పాఠ్యాంశాలతో పాటు పైన వివరించిన విలువల్ని మహాత్ముల జీవితాల్లోని స్ఫూర్తిదాయక సంఘటనల ద్వారా సోదాహరణగా బోధించాలి. అప్పుడే స్వామి వివేకానంద ఆశించిన శీలవంతులైన ఆదర్శ యువకులు తయారుకాగలరు. ఏ మార్పునైనా ఒక్కరోజులో తీసుకురాలేమన్న విషయాన్ని గుర్తుంచుకొని పట్టుదలతో పరిశ్రమిస్తే దేనినైనా సాధించవచ్చని విశ్వసించండి. విద్యా విధానంలో ఎవరో మార్పును తెస్తారని ఎదురుచూడడం కన్నా ఆ మార్పుకు మనమే నాంది పలుకుదాం. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :
యువవాణి
శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029

మనసు-మర్మం - స్వామి బుధానంద

పవిత్ర ఆలోచనలతో మనోనిర్మలత!

మనందరి జీవితాలలో కనపడే వింతైన విషయం ఒకటి ఉంది. మనకు మంచి ఏదో తెలుసు కానీ ఆ పనిని చెయ్యలేం; మనకు చెడు ఏదో కూడా తెలుసు కానీ దాన్ని చెయ్యకుండా ఉండలేం. మనం చాలా మంచి నిర్ణయాలు తీసుకుంటాం. కానీ మనకు తెలిసే లోపలే, పెను ఉప్పెన ముందు నిలువలేని మట్టిగోడలాగ, అవన్నీ కొట్టుకుపోతాయి. మనం దిగ్భ్రాంతి చెందుతాం; నిస్పృహ చెందుతాం.

ఈ విషయాన్ని జాగ్రత్తగా పరిశీలిద్దాం. మనసులో ఒక భాగమైన చైతన్య స్థితిలో మనం ఆ నిర్ణయాలు తీసుకుంటున్నాం. మనమే మన మనస్సులోని మరొక భాగమైన చైతన్యరహిత స్థితితో వాటిని కాలరాస్తున్నాం. ఈ చైతన్యరహిత స్థితిని గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. అక్కడంతా కారుచీకట్లు కమ్ముకుని ఉన్నాయి.

మనస్సును స్వాధీనం చేసుకోవడానికి ఉపక్రమించిన క్షణం నుండీ అంతర్గతమైన సమస్యలతో మనం సతమతమైపోతాం. కొంతకాలం వరకూ, మనం ఎంత ఎక్కువగా ప్రయత్నిస్తే మన కష్టాలు అంత ఎక్కువ అవుతాయి. మనం పనికట్టుకొని చైతన్యస్థితిలోని మనస్సును స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించినప్పుడు చైతన్యరహితస్థితిలో ఉండి, మనకు వ్యతిరేకంగా పనిచేసే శక్తులతో ఢీకొంటాం. మన పూర్వసంస్కారాలు, పాత తలంపులు, జ్ఞాపకాలు, స్వభావాలు- ఇవే ఈ వ్యతిరేక శక్తులు. మనం ఏది ఆలోచించినా, అది మన మనస్సుపై శక్తిమంతమైన ఒక చెరగని ముద్రను వేస్తుంది. ఈ ముద్రలు చైతన్యరహిత స్థితిలో నుంచి పైకిలేచి కార్యరూపం దాల్చడానికి ప్రయత్నిస్తాయి. ఎప్పుడైతే చైతన్యస్థితిలో ఉన్న మన ఆలోచనలకు ఇవి సరిపడవో అప్పుడు మనస్సులో సంఘర్షణ మొదలవుతుంది.

ఈ చైతన్యరహిత స్థితి ఇళ్ళలో ఉండే నేలమాళిగ లాంటిది. దానిలో ఎంత చెత్త పేరుకుపోయి ఉందో, దాన్ని శుభ్రం చేద్దామనుకునే వరకూ మీకు తెలియదు. ఆ పని ప్రారంభించే ముందు దానిలో ఎటువంటి సామాను ఉందో, పురుగుపుట్రా ఉన్నాయో కూడా మీకు తెలియదు. త్వరలోనే నీరసం వచ్చి ఆ పనిని అర్ధాంతరంగా ఆపివేస్తారు. ఆ నేలమాళిగ అలాగే ఉండిపోతుంది. ఇక అది ఎప్పటికీ నివాసయోగ్యం కాదు. కానీ ఎప్పటివరకూ ఈ చైతన్యరహిత స్థితి అనే నేలమాళిగను శుభ్రం చెయ్యమో, అంతవరకూ చైతన్య స్థితిలో ఉన్న మనస్సు యొక్క స్వాధీనత గురించి నిబ్బరంగా ఉండలేము. కాబట్టి తప్పనిసరిగా మనస్సులోని ఈ చీకటిమూలల్ని శుభ్రం చేసే పద్ధతిని మనం కనుక్కోవలసిందే. ఆ పని చెయ్యడం ఎలా?

ఒక సిరాబుడ్డిని శుభ్రం చెయ్యాలనుకున్నారనుకోండి! అది ఎలా? మంచి నీళ్ళని ఆ బుడ్డిలో పోస్తాం. లోపల ఎండిపోయిన సిరా నీళ్ళలో నాని, కరిగిన కొద్దీ నల్లగా ఉన్న నీరు బయటకు వస్తుంది. క్రమక్రమంగా బయటకు వచ్చే నీటి రంగు తగ్గుతుంది. చిట్టచివరికి స్వచ్ఛమైన నీరు మాత్రమే సిరాబుడ్డిలో నుంచి బయటకు వస్తుంది.

ఈ చైతన్యరహిత స్థితిలో ఉన్న మనస్సుని శుభ్రం చెయ్యడానికి దానిలో పవిత్రమైన ఆలోచనలను నింపడం అనేది ఒక పద్ధతి. ఆలోచనలను మన మనస్సు లోతుల లోనికి చొచ్చుకు పోనివ్వాలి. ఈ పవిత్రమైన ఆలోచనలు మంచినీటిలాగ పనిచేస్తాయి. అయితే మనలోంచి నల్లటి మురికినీరు బయటకు రావడం చూసి బెదిరిపోకూడదు. మనస్సును పవిత్రమైన ఆలోచనలతో నింపడం కొనసాగిస్తే ఒకానొక సమయానికి పవిత్రమైన ఆలోచనలు మాత్రమే మనలో నుంచి బయటకు రావడం గమనిస్తాం. అప్పుడు చైతన్యరహిత స్థితిలో ఉన్న మనస్సు శుభ్రపడిందని మనం తెలుసుకోవచ్చు. ఆపైన చైతన్య స్థితిలోని మనస్సును స్వాధీనం చేసుకోవడం పెద్ద కష్టం కాదు. ❖

స్వామి వివేకానందుని దృష్టిలో

ఆదర్శ విద్యార్థి

-స్వామి రఘునాయకానంద

ఇది చదువుల యుగం. పిల్లవాడు పుట్టిన వెంటనే డాక్టర్ని చేయాలనో లేక ఇంజనీర్ని చేయాలనో కలలు కంటూ తమ ఆలోచనలను పసిపిల్లవాని లేత మనస్సుపై చొప్పించ ప్రయత్నించే తల్లితండ్రులూ; పోటీ ప్రపంచానికి దీటుగా విద్యార్థులను తయారుచేయాలని తపన పడే విద్యాసంస్థలూ ఆదర్శ విద్యార్థులను సమాజానికి అందించడం లేదు. ఆదర్శ వ్యక్తిత్వాలే దేశ ఔన్నత్యానికి ప్రతీకలు; ఆదర్శ విద్యార్థులే దేశ ప్రగతికి చిహ్నాలు.

విశ్వవిద్యాలయంలో విద్యను పూర్తి చేసుకొని నేడు బాహ్య ప్రపంచంలోకి అడుగిడుతున్న భారతీయ విద్యార్థి నుంచి సమాజం ఆశించేదేమిటి? విద్యార్థి నేర్చుకొనే ముఖ్యమైన అంశాలు: లక్ష్యాలు, పరీక్షలు, ఉద్యోగాలు అనే మూడు సంకుచిత భావాలతో కూడుకొన్నవే. ఆ విధంగా విద్య అనేది జీవనోపాధిని కల్పించడమే నేర్పిస్తుంది తప్ప జీవించడం నేర్పటం లేదు. విద్యార్జన అనేది జీవనోపాధిని కల్పించడంతో పాటు జీవించడం నేర్పాలి. విద్యార్జన కేవలం ఒక ఉద్యోగం సంపాదించడంతోనే ఆగిపోకూడదు. ఇది జీవితాంతం సాగే ప్రక్రియ. "నేను బ్రతికి ఉన్నంతకాలం నేర్చుకుంటూనే ఉంటాను" అంటారు శ్రీరామకృష్ణులు. ఇటువంటి భావంతో కూడిన విద్య నిరంతరం వ్యక్తిత్వ వికాసానికి దోహద పడుతుంది. అలాంటి విద్యను ఆర్జించేవారు ఆదర్శ విద్యార్థులు.

సద్గుణాలతో శీల నిర్మాణం

ఒక ప్రఖ్యాత శిల్పి అందమైన శిల్పాన్ని చెక్కాడు. ఆయన స్నేహితుడు ఆ అద్భుతమైన శిల్పాన్ని చూసి ఆశ్చర్యచకితుడై ఆ శిల్పితో నీవు ఎంత అద్భుతమైన శిల్పాన్ని మలిచావన్నాడు. దానికి శిల్పి సమాధానం చెబుతూ నేను చేసింది ఏమీ లేదు. నాకు పనికిరానిది రాయి నుంచి తీసివేశాను అంతే. శిల్పం ఆ రాయిలో గర్భితంగా ఉంది అన్నాడు. క్రమశిక్షణ, నిజాయతీ, దయ, పరోపకారత, పట్టుదల, అంకిత భావం, సహనం, పవిత్రత మొదలైన లక్షణాలు మనలో ఉన్నాయి. ఏవిధంగా అయితే శిల్పి తనకు పనికిరానిది తీసివేశాడో అదే విధంగా మనలో ఉన్న చెడు లక్షణాలు తీసివేసినప్పుడే మనం శీలవంతులం కాగలం. వేల సంవత్సరాల క్రితమే మన వేదాలలో ఋషులు "భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః, భద్రం పశ్యే మాక్షభిర్యజత్రాః ...స్థిరైరంగైస్తుష్టు వాగ్ంసస్తనూభిః – శుభకరమైన విషయాలనే మా చెవులతో విందుముగాక, శుభకరమైన దృశ్యాల్నే మా కళ్ళతో చూచెదముగాక, దృఢమైన ఈ శరీరంతో మంచి పనులే చేసెదము గాక" అని చెప్పడం జరిగింది. మన ప్రతీ ఆలోచనా, చేసే ప్రతీ పనీ మన మనస్సు మీద ఒక చెరగని ముద్రను వేస్తుంది. అంటే మన ఆలోచనలు, పనులు మన శీలం మీద ప్రభావం చూపిస్తాయి కనుక మనం శీలవంతులమా కాదా అన్నది ఈ సంస్కారాల ప్రభావం మీద ఆధారపడి ఉంటుంది. ధనం వల్ల, పేరు ప్రతిష్ఠల వల్ల, పాండిత్యం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. మంచి శీలం మాత్రమే దుస్సాధ్యమైన కష్టాల అడ్డుగోడల్ని పగులగొట్టుకొని ముందుకు చొచ్చుకొని పోతుంది అంటారు స్వామి వివేకానంద. మంచి పనుల ద్వారా , మంచి ఆలోచనల ద్వారా, మంచి అలవాట్ల ద్వారా మంచి సంస్కారాలను కనుక తయారుచేసుకోగలిగితే మనం శీలవంతులుగా మారుతాం. ఇది అర్థం చేసుకొన్నప్పుడే మన ఆలోచనలకు, పనులకు ప్రాముఖ్యాన్ని ఇవ్వగలం. శీలవంతులుగా మారాలంటే సద్గుణాలను తప్పక అలవరచుకోవాలి. శీలవంతులే బాధ్యతనంతా మోయగలరు. పరిస్థితులు అనుకూలించనప్పుడు వ్యక్తి ప్రవర్తనను బట్టి వాడు శీలవంతుడా కాదా అన్నది నిర్ణయించ బడుతుంది. ఇనుములో కార్బన్ శాతం ఇనుము నాణ్యతను నిర్ణయించినట్లుగా విద్యార్థికున్న శీలమే అతని గొప్పతనాన్ని నిర్ణయిస్తుంది.

ధైర్యసాహసాలు

సమస్యలకు సమాధానం సాహసం. ఏదైనా సమస్యగానీ, ప్రమాదం గానీ ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కోవాలి. సమస్యలకు పరిష్కారం వాటినుండి పారిపోవడం కాదు, ప్రతిఘటించి నిలబడడం అనేవారు స్వామి వివేకానంద. ఒకసారి స్వామి వివేకానంద కాశీలో ఒక దేవాలయం నుండి తిరిగి వస్తున్నప్పుడు కోతుల మూక ఆయన్ని వెంబడించగా ఆయన వెనుదిరిగి పరుగెత్తనారంభించారు. ఇది గమనిస్తున్న ఒక వృద్ధ సన్న్యాసి 'ఆగు, ఆగి ఎదుర్కో, వాటిని ప్రతిఘటించు" అన్నాడు. ఆ మాటలు విన్న స్వామి వివేకానంద నూతనో

త్సాహంతో ధైర్యంగా ఎదురుతిరిగి నిలబడ్డారు. వెంటనే కోతిమూక వెనక్కు తిరిగింది.

ఈ సంఘటన తనకు జీవితంలో ఒక గుణపాఠం నేర్పిందని కాలాంతరంలో చెబుతూ, "సమస్యను ధైర్యంతో ఎదుర్కోవాలి. పిరికితనం ప్రదర్శించకూడదు, ఎంత భయంకర సన్నివేశాన్నైనా సాహసంతో ఎదుర్కోవాలి" అన్నారు స్వామి వివేకానంద.

ఆత్మగౌరవం - ఆత్మవిశ్వాసం

మనగురించి మనకున్న అభిప్రాయాన్నే ఆత్మగౌరవం అంటారు. మనం ఈ విధంగా తయారుకావడానికి మన ఆలోచనలే కారణం. మీరు మంచి విద్యార్థిగా, నిజాయతీ పరుడిగా ఉన్నప్పుడు, మీ శక్తిసామర్థ్యాలు, బలహీనతల

మీద మీకున్న అంచనాయే ఆత్మగౌరవంగా చెప్పబడుతుంది. స్వామి వివేకానందకు తల్లి భువనేశ్వరీ దేవి ఇలా హిత బోధ చేసింది: "పవిత్రంగా ఉండు. స్వచ్ఛమైన జీవితాన్ని జీవించు. ఆత్మగౌరవాన్ని సంరక్షించుకో. ఇతరులను గౌరవభావంతో చూడు." అందుకే నచికేతుని శ్రద్ధ మీద ఆయనకు ఎనలేని గురి ఉండేది. నచికేతుడి తండ్రి యాగంలో దక్షిణగా ఎందుకూ పనికిరాని ఆవులను బ్రాహ్మణులకు ఇస్తున్నప్పుడు ఆ తప్పిదాన్ని భరించలేక "మరి నన్ను ఎవరికి ఇస్తావు" అన్నప్పుడు తండ్రి యథాలాపంగా యముడికి అన్నాడు. అది విన్న నచికేతుడు తన ఆత్మగౌరవాన్ని కించపరచుకోకుండా "చాలామందిలో ఉత్తముణ్ణి అయినా అవుతాను. లేదా చాలా మందిలో మధ్యముణ్ణి అయినా అవుతాను; నేను అందరికంటె అధముణ్ణి మాత్రం కాను మరి నాన్న ఇలా అన్నాడు ఏమిటి" అని ఆలోచిస్తాడు.

ఆత్మగౌరవంలో ఆత్మవిశ్వాసం నిండి ఉంది. తన మీద తనకున్న నమ్మకం కారణంగా ఉత్సాహంతో ఏ కార్యంలోనైనా ముందంజ వేయగలరు. వారు చేసే పని ఏదైనా దృఢ నిశ్చయంతో, గొప్ప ఉత్సాహంతో చేస్తారు.

అన్ని దౌర్బల్యాలనూ అవతలికి నెట్టి వేయండి!! "నువ్వు సుదృఢంగా ఉన్నావు" అని శరీరానికి చెప్పండి. "నువ్వు బలమైనదానవు" అని మనస్సును ప్రేరేపించండి. అనంత ధైర్యాన్నీ, అపార విశ్వాసాన్నీ కలిగి ఉండండి.

బలవంతులు కండి

స్వామి వివేకానంద ప్రతి విద్యార్థికీ ముఖ్యంగా ఉండవలసినవి మూడు బలాలు అంటారు. కండ బలం, బుద్ధిబలం, ఆత్మబలం. మొదట కావల్సింది కండ బలం - దేశానికి కావల్సింది బలిష్ఠులే. శారీరక బలం కోసం ప్రతిరోజూ క్రమం తప్పక వ్యాయామం చేయాలి. తద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చు. అప్పుడు మాత్రమే సరైన నిర్ణయాలను తీసుకోగలం. మహాత్ముల జీవితాలను చదవడం ద్వారా మానసిక బలాన్ని పెంపొందించుకోవచ్చు. ముఖ్యంగా స్వామి వివేకానందుల ఆలోచనలను జీవితంలో ఆచరణలో పెట్టగలిగితే మనలో మానసిక బలం పెంపొందడంతో పాటు ఆ ఆలోచనలే మనల్ని ప్రేరేపితులను చేసి శీలవంతులుగా మారుస్తాయి. ఇక ముఖ్యంగా కావల్సింది ఆత్మబలం. "ప్రతీ మనిషిలో ఉన్న దివ్యత్వం గురించి తెలియజేసి దానిని దైనందిన జీవితంలో ఏ విధంగా ప్రకటితం చేయాలో తెలియజేయడమే నా ఆదర్శం" అంటారు స్వామి వివేకానంద. ఆ దివ్యత్వమే ఆత్మబలం. అందరిలో ఉన్న ఆ ఆత్మ (శక్తి)ని ధ్యానం, ప్రార్థనల ద్వారా తట్టి లేపాలి. ఈ ఆత్మబలంతో కూడిన పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రాన్ని భారతీయ విద్యార్థులు నేర్చుకోవాలి. ఈ ఆత్మబలం అసమానతలను, కుల వర్గ వైషమ్యాలను తొలగించి ఉన్నతమైన విలువలను ప్రసాదిస్తుంది. సమాజంలో గల అన్ని రకాల బలహీనతలకూ ఇదే పరిష్కారం.

ఈ వేదాంతభావాన్ని (ఆత్మ బలాన్ని) ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో ఆచరణలో పెట్టినప్పుడు చేపలు పట్టేవాడు మరింత నైపుణ్యంగల చేపలు పట్టేవాడిగా, వ్యాపారి మంచి వ్యాపారిగా, విద్యార్థి ఒక ఆదర్శమైన విద్యార్థిగా మారుతారు. సౌశీల్యం, ధైర్య సాహసాలు, ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, శారీరక బలం, మానసిక బలం, ఆత్మబలం వంటి విలువలు గల ప్రతీ విద్యార్థీ ఆదర్శ విద్యార్థే. రండి! స్వామి వివేకానందుని భావాలను ఆచరణలో పెట్టి ఆదర్శ విద్యార్థులుగా తయారవుదాం!!. ❖

చదవండి... చదివించండి!

- స్వామి సేవ్యానంద

ఆధ్యాత్మిక పుస్తకాలు జీవితపు చివరి రోజుల్లో చదవడానికై ఉద్దేశించబడ్డాయని చాలా మంది అనుకుంటారు. కానీ, వీటిని ఎంత చిన్నతనంలో చదవడం ఆరంభిస్తే అంత మంచిది. మన నిత్యజీవితంలో ఇవి ఎలా ఉపయోగపడగలవు?

బాల్యంలో బంగారుబాట: తమ పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత తల్లితండ్రుల పైనే వుంది. క్లాసు పుస్తకాలతోపాటు బాలల ఆధ్యాత్మిక కథల పుస్తకాలను వారికి ఇచ్చి, వారికి అర్థమయ్యే రీతిలో చెప్పే ప్రయత్నం చేయాలి. ఈ కంప్యూటర్ల యుగంలో కథలు చెప్పే సమయం ఎవరికుందని అడగవచ్చు. అయితే, నేడు తల్లితండ్రులు తమ పిల్లలకు ఉన్నతమైన నైతిక విలువలు అందించలేకపోతే, రేపు వారి పిల్లలు కూడా తల్లితండ్రులకై సమయం వెచ్చించడం వ్యర్థమని భావించి, వారిని ఏ వృద్ధాశ్రమాల్లోనో చేర్పించే అవకాశం వుంది. నేడు మన దేశంలో పుట్టగొడుగుల్లాగ పెరుగుతున్న ఈ వృద్ధాశ్రమాల సంస్కృతికి ఇదే కదా కారణం! జీవితంలో చివరి రోజులు కాస్తా వృద్ధాశ్రమాల్లో గడపాలని ఎవరు కోరుకుంటారు?

యువతరానికి శక్తినిచ్చే టానిక్ : రామకృష్ణమఠం రామకృష్ణ మిషన్‌ల 13వ సర్వాధ్యక్షులైన శ్రీమత్ స్వామి రంగనాథానందజీ మహారాజ్ 1949 వ సంవత్సరంలో హైదరాబాద్ వెళ్ళినపుడు రాష్ట్ర మిలటరీ గవర్నర్ జనరల్ జె.ఎన్.చౌదరీని కలవడం జరిగింది. అతని టేబిల్‌పై 'భగవద్గీత' పుస్తకం చూసి, మహారాజ్ "జనరల్ చౌదరీ, మీరు 'గీత' చదువుతారా?" అని అడిగారు. "నాకు అలసటగా ఉన్నపుడు కొంత శాంతి కోసం ఈ పుస్తకాన్ని చదువుతాను" అన్నది ఆయన సమాధానం. "ఆ పుస్తకం యొక్క ఉద్దేశ్యం అది కాదు....." అంటూ మహారాజ్ తన సంభాషణను కొనసాగించారు. "..... ఈ పుస్తకం శాంతినివ్వడానికి మాత్రమే కాదు. మనల్ని బాధ్యతగల పౌరులుగా తయారుచేసి, మానవసేవ చేయడానికి కావలసిన శక్తి, సామర్థ్యాలను మనకు ఇవ్వడమే ఈ పుస్తకం యొక్క ఉద్దేశ్యం....".

నేటి యువతరం అర్థంలేని ఆందోళనలకు, ఆవేశాలకు, ప్రతికూల శక్తులకు (Negative powers) దూరంగా వుండి, తమలో దాగివున్న సానుకూల యువశక్తి (Positive youth power) ని ఆధునిక యుగానికి అందించాలంటే ఆధ్యాత్మిక పుస్తకాలనూ, స్వామి వివేకానందుని ఉపదేశాలనూ చదవడం తప్పనిసరి.

వృద్ధాప్యంలో ఉన్నతమైన జీవితం: ఒక రాజ్యంలో మొదటి నుంచీ వస్తున్న ఒక వింతైన ఆచారం ఉంది. ఎంత గొప్ప రాజైనా ఐదు సంవత్సరాలు పరిపాలించాక తన రాజ పదవితోపాటు రాజ్యాన్ని కూడా వదిలి, దూరంగా ఉన్న అడవిలో మిగిలిన జీవితాన్ని గడపాలి. ప్రస్తుతానికి ఈ రాజ్యాన్ని పరిపాలిస్తున్న విజయుడు తెలివైనవాడు. తన గడువు పూర్తికాకముందే అడవిలో అవసరమైన అన్ని సదుపాయాలనూ ఏర్పాటుచేసి, మరో రాజ్యాన్నే నిర్మించాడు. మిగిలిన జీవితాన్ని తనదైన క్రొత్త సామ్రాజ్యంలో ఆనందంగా గడిపాడు.

పూర్వం వృద్ధాప్యంలో మన పెద్దలు, ఆధ్యాత్మిక పుస్తకాలను చదువుతూ, చిన్నారులకు నాలుగు మంచి మాటలు చెబుతూ, ఉన్నతమైన మన సంస్కృతిని ముందు తరాలవారికి అందించే సారథులుగా ఉండేవారు. నేడు నాయనమ్మలు, తాతయ్యలు కూడా మూన్నాళ్ళ ముచ్చటైన భౌతిక సుఖాలకు బానిసలై స్టార్ ఛానల్ చూడాలో లేదా స్పోర్ట్స్ ఛానల్ చూడాలో నిర్ణయించుకోలేక సతమత మవుతున్నారు. మనల్ని భయంకరమైన మృత్యువు ఆలింగనం చేసుకోకముందే మనకంటూ ఒక ఆధ్యాత్మిక సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటే, మన భవిష్యత్తుకూడా ఆ విజయునిలాగే ఆనందమయం కాగలదు. అప్పుడే మనిషిగా జన్మించినందుకు ఈ జీవితానికి అర్థం, పరమార్థం ఉంటాయి. ❖

(1884–1967)

ముందుకు సాగిపో!

– స్వామి ప్రేమేశానంద

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884 – 1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ –వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావంతో ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి.

స్వామి ప్రేమేశానంద లేఖల్లో ప్రేమపూర్వక అభినందనలే కాక, వ్యక్తిగత సమస్యలకు తగిన సూచనలు కూడా ఉంటాయి. అవి అన్ని తరగతుల వారినీ ప్రభావితం చేస్తాయి. స్వామి ప్రేమేశానందజీ లేఖలు సహజమైన భావ గాంభీర్యంతో, హాస్య చతురతతో, స్వతఃసిద్ధమైన రచనా శైలితో పాఠకుల హృదయాలను సూటిగా తాకుతాయి. ఒక వ్యక్తి శీలాన్ని అవగాహన చేసుకొని, అతడు ఏ 'తరగతి'కి చెందినవాడో విశ్లేషించి, అందుకు తగిన రీతిలో స్వామీజీ సూచనలు ఇచ్చేవారు. ఒక వ్యక్తి తన జీవితాన్ని మలచుకొని, జీవిత పరమలక్ష్యాన్ని దర్శించేందుకు ఆ సూచనలు, సలహాలు దోహదపడ్డ ఘటనలు ఎన్నెన్నో! ప్రేమేశానందజీ వేర్వేరు సందర్భాల్లో వేర్వేరు మందికి వ్రాసిన లేఖలైనప్పటికీ, వీటిని ఇప్పుడు చదువుతున్నా సరే, సాక్షాత్తూ ఆత్మీయుడో, ప్రియబాంధవుడో ఎదుట నిలబడి తనతో ముచ్చటిస్తున్న అనుభూతిని పాఠకుడు పొందుతాడు. ఈ లేఖలను చదివిన వారందరూ వీటిని 'అమూల్య నిధులు'గా అభివర్ణించారు.

ఆధ్యాత్మిక పథంలో పయనించే ముందుతరాల తెలుగు పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖల తెలుగు అనువాదాలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో నెల నెలా ధారావాహికంగా ప్రచురించదలచాం. వీటి ద్వారా పాఠకులు లబ్ధి పొందగలరని ఆశిస్తున్నాం. ❖

తెలుగుసేత : కె. త్రివిక్రమరావు

బెరహమ్‌పూర్,
15–3–1940.

ప్రియమైన విపత్ భంజన్!*

మానవుని పురోభివృద్ధికి అతనిలోనే దాగి ఉన్న అనంతశక్తిని గురించి నీకు ఎరుక కలిగించాలనుకుంటున్నాను. పూర్వులు తమ కలలో కూడా అనుకోని గొప్ప పనులు ఈ ఆధునిక యుగంలోని మానవులు సాధిస్తున్నారు. మానవుని ప్రతిభను గురించి స్వామి వివేకానంద మనకు ఎంతో దయతో బోధపరిచారు. ఆ బోధనల్ని ప్రజల్లో మారుమ్రోగించాలన్నదే మన కోరిక. ఏమైనప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాదు.

ఉదాహరణకు ఖగోళశాస్త్ర సత్యాన్నొకదాన్ని నువ్వు కనుగొన్నావనుకో, సాధారణ మానవునికి అర్థమయ్యేటట్లు దాన్ని వివరించడం నీకు కష్టం. ఖగోళశాస్త్రం గురించిన అవగాహన ఉన్నవాడు మాత్రమే దాన్ని అర్థం చేసుకోగలడు. అలాగే ఈ యుగంలో శ్రీరామకృష్ణులు, స్వామి వివేకానంద అనేక విశ్వజనీన సత్యాలను కనుగొన్నారు. యువకులు చాలా మంది యాంత్రిక జీవనం గడుపుతున్నారు. వారికి ఏ ఉన్నత ఆశయమూ లేదు. నువ్వు మహోన్నత వ్యక్తిగా ఎదగాలని నేను ఆశిస్తున్నాను. ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించాలంటే శ్రీరామకృష్ణులు చెప్పిన 'ముందుకు సాగిపో...' అనే కథలోని బ్రహ్మచారిలా దృఢ సంకల్పం కలిగి ఉండాలి. ఇదే నీకు పరమ మంత్రం అని తెలుసుకో. ఈ అనంత విశ్వాన్ని సృజించిన ఆ సృష్టికర్త యొక్క ఘనమైన ప్రబోధాలపై ధ్యానం చెయ్యి. 'ముందుకు సాగిపో... ముందుకు సాగిపో'

"మిమ్మల్ని మీరు బోధపర్చుకోండి. ప్రతి ఒక్కరికీ వారి వారి స్వస్వరూపాన్ని బోధపర్చండి. నిద్రాణమైన ఆత్మను తట్టి లేపితే ఎలా మేల్కొంటుందో గమనించండి. నిద్రాణమైన ఆత్మను మేల్కొల్పితే శక్తి ఉద్భవిస్తుంది, ప్రకాశం ఉద్భవిస్తుంది, పవిత్రత ఉద్భవిస్తుంది. ప్రతిభావంతమైనవన్నీ ఉద్భవిస్తాయి"

– స్వామి వివేకానంద

మీరంతా లాభనష్టాలు, చావు పుట్టుకలు బేరీజు వేసే పనికిమాలిన ఆలోచనలకు స్వస్తి చెప్పి, శ్రీరామకృష్ణుల సేవాపరికరాలుగా రూపొందడానికి మీ శాయశక్తులా ప్రయత్నించండి. ప్రపంచం యావత్తూ మీ నుంచి ఆశిస్తున్నది ఇదే!

ప్రేమాశీస్సులతో...
స్వామి ప్రేమేశానంద

(*కాలాంతరంలో రామకృష్ణ సంఘంలో 'స్వామి స్వాహానంద'గా ప్రసిద్ధులు)

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ శ్రీనివాస వెంకటరమణా రావు,	ప్రాథమిక పాఠశాల, బండివారి గూడెం, పశ్చిమగోదావరి జిల్లా
శ్రీ పొన్నం లక్ష్మీనారాయణ, గుమ్మడిముర్రు	మండల పరిషత్ ఉన్నత పాఠశాల, గుమ్మడిముర్రు, కృష్ణా జిల్లా
శ్రీ జయా నైక్, ఓబులదేవ్ నగర్, అనంతపురం	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దపల్లి, అనంతపురం జిల్లా
శ్రీ నారాయణ రెడ్డి, చిరుక్యపూర్ కాలనీ, కర్నూలు	శేషారెడ్డి ఉన్నత పాఠశాల, బేతంచర్ల, కర్నూలు జిల్లా
శ్రీ కోటపాటి హనుమంత రావు, కల్యాణ్ నగర్, హైదరాబాద్	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిన్న లింగాయపాలెం, గుంటూరుజిల్లా
శ్రీమతి & శ్రీ ప్రసాద్ ఎ.బి.ఎస్.ఆర్, బేగంపేట్, హైదరాబాద్	పుణ్యలోక్ వృద్ధాశ్రమం, చిన్న అవుతపల్లి, కృష్ణాజిల్లా
శ్రీ గంగిరెడ్డి ఉన్నత పాఠశాల, కల్వరాల, మహబూబ్‌నగర్ జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్వరాల, మహబూబ్ నగర్ జిల్లా
శ్రీ కె. నీలకంఠ రెడ్డి, బచ్చలివారి పల్లి, అనంతపురం జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పులికుంటపల్లి, అనంతపురం జిల్లా
శ్రీ కె. ధనంజయ రెడ్డి, బచ్చలివారి పల్లి, అనంతపురం జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఈత్తోడు, అనంతపురం జిల్లా
శ్రీ బోయెల్ల జనార్ధన్ (కీ॥శే॥ఎన్. సుబ్బరాజు జ్ఞాపకార్థం), రేవూరు, నెల్లూరు జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రేవూరు, నెల్లూరు జిల్లా
శ్రీ హరీష్ (కీ॥శే॥ బి. వెంకట కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం), ఎ.కె.నగర్, నెల్లూరు జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పామిరెడ్డిపాడు, నెల్లూరు జిల్లా
" " "	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వారికుంటపాడు, నెల్లూరు జిల్లా
శ్రీ అడబాల నరేంద్ర,	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మొగల్తూరు, పశ్చిమ గోదావరి జిల్లా
శ్రీ రాజారెడ్డి, పైడి, (కీ॥శే॥ పైడి ప్రశాంతి, అల్లూరి రాజారెడ్డి,	పి.వి.పి ఓరియంటల్ స్కూల్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా,
చిలుకూరి సంగారెడ్డిల జ్ఞాపకార్థం) శ్రీరామ్ నగర్ కాలనీ, నిజామాబాద్ జిల్లా	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కల్వరాల, సదాశివనగర్, నిజామాబాద్ జిల్లా
" " "	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తాడ్వాయ్, నిజామాబాద్ జిల్లా - 503 120
" " "	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎర్రపహాడ్, నిజామాబాద్ జిల్లా - 503 120
" " "	బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా - 503 111
" " "	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దేమికలన్, తాడ్వాయ్, నిజామాబాద్ జిల్లా
" " "	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బ్రాహ్మన్‌పల్లి, తాడ్వాయ్, నిజామాబాద్ జిల్లా
శ్రీ జలగం గోపాల్ రావు (కీ॥శే॥ జె. లింబా రావు)	ప్రభుత్వ పాఠశాల, సంగమేశ్వర్, దోమకొండ, నిజామాబాద్ జిల్లా
" " "	శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా
" " "	కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా
శ్రీ మండ శ్రీధర్ రెడ్డి (కీ॥శే॥ ఎమ్. కమలా రెడ్డి)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భానీపేట్, నిజామాబాద్ జిల్లా - 503 111
ఎమ్/ఎస్ లక్ష్మీనారాయణ ఎంటర్‌ప్రైజెస్, ఖార్ఖానా, సికింద్రాబాద్	ఎస్.ఆర్.వి.బి.ఎస్.జె.బి.ఎమ్.ఆర్ కాలేజ్ పెద్దాపురం, పశ్చిమగోదావరి జిల్లా
" " "	లైబ్రేరియన్, నలంద డిగ్రీ కళాశాల, లబ్బీపేట్, విజయవాడ-520 010
" " "	లైబ్రేరియన్, డా॥ బి.ఆర్. అంబేద్కర్ లైబ్రరీ, గుంటూరు జిల్లా - 522 510
" " "	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, బంటుమిల్లి, కృష్ణాజిల్లా - 501 324
" " "	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మల్లవోలు, కృష్ణాజిల్లా - 521 149
" " "	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, పోరంకి, పెనమలూరు, విజయవాడ రూరల్
" " "	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కనుమోలు, కృష్ణాజిల్లా - 521 106
" " "	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, రామవరప్పాడు, నిడమనూరు, విజయవాడ
" " "	లైబ్రేరియన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సామర్లకోట, తూర్పుగోదావరి జిల్లా
శ్రీ ఎన్. శివమల్లికార్జున్, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కండవల్లి, పశ్చిమగోదావరి జిల్లా
శ్రీ పి. సురేష్, అనకాపల్లి, విశాఖపట్నం	ప్రేమ సమాజం, దాబా గార్డెన్స్, విశాఖపట్నం
శ్రీమతి గుణలక్ష్మి, విశాలాక్షి నగర్, విశాఖపట్నం	బి.వి.కె. ఉన్నత పాఠశాల, విశాలాక్షి నగర్, విశాఖపట్నం - 530 043

ఈ పథకం ద్వారా శ్రీరామకృష్ణ ప్రభను మరింతమందికి చేరువ చేస్తున్న దాతలకు కృతజ్ఞతలు.

అద్భుత గ్రామం ఆయన సృష్టి

– జి. సతీష్

అన్నా హజారే పూనే దగ్గర ఉన్న రాలెగాం సిద్ధి అనే చిన్న గ్రామపు భవితని అద్భుతంగా మార్చివేసారు! అక్కడ ప్రతీ ఒక్కరూ ఎదుటివారి (సం)క్షేమం పట్ల శ్రద్ధ వహిస్తారు; తమ అవసరాలకి మించి ఎక్కువగా పంట పండితే, మరుసటి సంవత్సరం తమ ఉపయోగానికే ఉంటుందిలే అని దాచుకోకుండా తినడానికి ఏమీ లేని వారికోసం ఏర్పాటైన చోట (గ్రేన్‌బ్యాంకులో) పంట ధాన్యాలని నిలవ చేస్తారు; ముఖ్యమైన పనులన్నిటికీ దేవాలయమే కేంద్రంగా ఉంటుంది; సమాజం అక్కడ 4 లక్షల చెట్లను నాటింది. ఆ గ్రామంలో ఏ దుకాణంలోనూ పొగాకుగానీ, మద్యంగానీ అమ్మడం జరగదు. చుట్టు పక్కల ఉన్న గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్యాంకర్లకై ఎదురుచూస్తుంటారు. అయితే రాలెగాం సిద్ధిలో ఆ గ్రామస్థులకి సరిపడేంత నీరు ఉండడమే కాకుండా, ఆ గ్రామాన్ని సందర్శించే వందలాదిమందికి కూడా సరిపడేటంత నీటి వసతి ఉంది!

అయితే రెండు దశాబ్దాల క్రితం అక్కడి పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉండేది; ఆ గ్రామం ఆర్థికంగా కానీ, సామాజికంగా కానీ నిలదొక్కుకోలేని దుఃస్థితిలో ఉండేది. ఎప్పుడు చూసినా అనావృష్టి... చవిటినేలలు... ఉద్యోగావకాశాలు లేనేలేవు. కడుపునింపుకోవడానికి వేరే మార్గం లేక నిరాశకి గురైన ప్రాంతీయులు మద్యం తయారు చేయనారంభించారు. మద్యపానం, హత్యలు, పగలు, నేరాలు అక్కడ సహజమయిపోయాయి. ఆ గ్రామ జీవనం చాలా నిస్తేజంగా ఉండేది. ఆ పరిస్థితులలో సైన్యంలో లారీ డ్రైవర్‌గా పనిచేసి రిటైర్ అయిన అన్నాహజారే, **"ఇతరుల కోసం జీవించిన వారే నిజంగా జీవించినట్లు, మిగిలిన వారు మృతతుల్యులు"** అన్న స్వామి వివేకానందుని బోధనతో స్ఫూర్తి పొంది, అక్కడి గ్రామ ప్రజలకు సేవలందించడానికి నడుం బిగించారు. అతి కొద్ది కాలంలోనే ఆ గ్రామ ఆర్థిక వ్యవస్థనూ, ప్రజల నైతిక విలువల్నీ పునరుద్ధరించారు ఆయన. ❖

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & పక్యాల గిరిజ, డైరక్టర్

SVISS LABSS LTD.,

(Manufacture of Bulk Drugs / Drugs Intermediates)
An ISO 9001 : 2000 Certified Company

No.88-89, Phase - II, Sipcot Industrial Complex,
Ranipet - 632 403, Tamil Nadu.

Web Site : www.svisslabss.com

"Are you growing spiritually? Can you love others? Can you feel oneness with others? Have you peace within yourself? And do you radiate it around you? That is called spiritual growth, which is stimulated by meditation, inwardly, and by work done in a spirit of service outwardly." ***- Swami Ranganathananda***

ADVT.

రామకృష్ణ మిషన్ సేవాశ్రమ (ధార్మిక ఆసుపత్రి)

(రామకృష్ణ మిషన్, పి.ఒ.బేలూర్ మఠ్, హౌరా జిల్లాకు అనుబంధిత శాఖాకేంద్రం)
స్వామి వివేకానంద మార్గ్, బృందావన్, మథుర జిల్లా, ఉత్తర్‌ప్రదేశ్–281 121.
ఫోన్ : 0565–2442310, ఫ్యాక్స్: 2443310
Email : rkmsvrnd@sancharnet.in, Website: www.rkmsvrind.org

విన్నపం

శ్రీకృష్ణుని దివ్యలీలా క్షేత్రం–యమునా నది ప్రవహిస్తున్న పుణ్య తీర్థం – బృందావనం. ఆ క్షేత్రం పేరు వింటేనే మనసు ఉన్నతమైన భక్తి భావనతో నిండిపోతుంది. శ్రీచైతన్య మహాప్రభువు, శ్రీరామకృష్ణుల సందర్శనం వలనా, మీరాబాయి, సూరదాసు, రూప, సనాతన గోస్వాములు మొదలైన భక్త శిరోమణుల సాధనల వలనా బృందావనం మరింత పవిత్రతను సంతరించుకొంది. ఈ పుణ్యక్షేత్ర వాసులకి రామకృష్ణ మిషన్ సేవాశ్రమ 1907 నుండీ అనేక సేవలు అందిస్తోంది.

'కాలాబాబు కుంజ్' భవనంలో శ్రీ శారదాదేవి బస చేసిన గది

శ్రీరామకృష్ణుల భక్తుడైన బలరాంబసుకి ఈ పవిత్ర వ్రజ భూమిలో "కాలాబాబు కుంజ్" అన్న పేరున్న పూర్వీకుల గృహం ఉంది. దివ్యజనని శ్రీ శారదాదేవి శ్రీరామకృష్ణులు మహాసమాధి చెందాక 1886లో బృందావనం వెళ్ళి ఈ "కాలాబాబు కుంజ్"లో సుమారు ఒక సంవత్సరం పాటు ఉన్నారు. ఆ తరువాత కూడా ఆమె అక్కడికి వెళ్ళినప్పుడు ఈ ఇంట్లోనే ఉండేవారు; ఇక్కడే శారదమ్మ మొట్టమొదట సారిగా స్వామి యోగానందకి మంత్రదీక్ష ఇచ్చారు. స్వామి వివేకానంద, స్వామి బ్రహ్మానంద, శ్రీరామకృష్ణుల ఇతర శిష్యులు ఆ ఇంట్లో ఉన్నారు. ఈ ఇంట్లోనే 1907లో రామకృష్ణ మిషన్ సేవాశ్రమ కేంద్రం లాంఛన ప్రాయంగా ప్రారంభమైంది.

మాతృమూర్తి శ్రీ శారదాదేవి పావనం చేసిన ఈ గృహాన్ని (కాలాబాబు కుంజ్) ఒక ఆధ్యాత్మిక స్మారక చిహ్నంగా

శ్రీ శారదాదేవి బస చేసిన 'కాలాబాబు కుంజ్' భవనం

తీర్చిదిద్దాలని బృందావనం రామకృష్ణ మిషన్ సేవాశ్రమ సంకల్పించింది. శ్రీ శారదాదేవి దివ్య స్మృతులను జ్ఞాపకం చేసుకొని ఆధ్యాత్మికంగా సన్న్యాసులూ, భక్తులూ లబ్ధి పొందడం కోసం దివ్యజనని ఉన్న 'కాలాబాబు కుంజ్' ఇంట్లోని ఒక భాగాన్ని రూ॥38 లక్షలకు కొనుగోలు చేయడం జరిగింది. కాలాబాబు కుంజ్‌లోని మిగతా భాగాన్ని కొని, మరమ్మత్తులు చేయించి ఈ స్మృతి కేంద్రంలో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్ని ప్రారంభించాలని సంకల్పించాం. ఈ భవనం కొనడానికీ, మరమ్మత్తులు చేయించడానికీ సుమారు **ఒక కోటి ముప్ఫై లక్షలు** వ్యయం అవుతుందని అంచనా.

ఈ ఆధ్యాత్మిక స్మృతి కేంద్ర నిర్మాణానికి మీరంతా ఉదారంగా విరాళాలిచ్చి సహకరించాల్సిందిగా కోరుతున్నాం.

"Ramakrishna Mission Sevashrama, Vrindaban" పేరున చెక్కు లేదా డి.డి తీసి క్రాస్ చేసి మీ విరాళాల్ని Ramakrishna Mission Sevashrama, Swami Vivekananda Marg, Vrindaban, Dist: Mathura, Uttar Pradesh-281 121 అనే చిరునామాకు పంపాల్సిందిగా మనవి. ఆదాయపు పన్ను చట్టంలోని 80(జి) విభాగం కింద విరాళాలకు పన్ను మినహాయింపు లభిస్తుంది.

భగవత్సేవలో

స్వామి సుప్రకాశానంద

కార్యదర్శి

ADVT.

మాటలు కావు...
అవి మహామంత్రాలు!

– వి. శ్రీనివాస్

నా పేరు శ్రీనివాస్. మాది తూర్పుగోదావరి జిల్లా మాన్యంపాలెం అనే చిన్న గ్రామం. నేను మా ఊరిలో ఇంటర్ మొదటి సంవత్సరం వరకూ తెలుగు మీడియంలో చదివాను. మా నాన్నగారు చనిపోయిన కారణంగా చదువు కొనసాగించ లేకపోయాను. తరువాత చిన్న చిన్న పనులు చేసుకొంటూ మా ఊరిలోనే ఒక సంవత్సరం గడిపాను. నాకు ఆ జీవితం ఏ మాత్రం సంతృప్తినివ్వలేదు. మద్రాసు వెళ్ళి అక్కడ ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగానికి చేరాను. అలా అక్కడ ఒక సంవత్సరం గడిపాను. అక్కడ నుండే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓ.యు.లో డిగ్రీ చేయడానికి అర్హత పొందాను. మద్రాసులో ఉండి చదివే అవకాశం ఉండదనుకొని, హైదరాబాద్ వచ్చాను.

ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, ప్రతీ ఆదివారం తరగతులకు హాజరు అయ్యే వాడిని. అలా మూడు సంవత్సరాల్లో డిగ్రీలో ఉత్తీర్ణుణ్ణయ్యాను. డిగ్రీ రెండవ సంవత్సరంలో ఉండగా రామకృష్ణ మఠం గురించి తెలిసింది. ఇంగ్లీష్ నేర్చుకోవాలనే ఉద్దేశంతో నేను ఒకసారి అక్కడకు వచ్చాను. అక్కడికి వచ్చిన స్టూడెంట్స్‌ని చూసి ఆశ్చర్యపోయాను. వివేకానంద ఇన్స్టిట్యూట్ ఇంత గొప్పదా అని ఆలోచించాను. మొదటి ప్రయత్నంలో సీట్ పొందలేకపోయాను. కానీ రెండవసారి స్పోకన్ ఇంగ్లీష్‌లో సీట్ సంపాదించగలిగాను. అప్పటి నుండీ నా జీవితంలో మార్పు మొదలయింది, నా ఆలోచనల్లో, ప్రవర్తనలో, జీవితం గురించి ఒక అవగాహన, స్పష్టత ఏర్పడింది. ఇక్కడిలాగ పాఠాలు బోధించే విధానం నేనెక్కడా చూడలేదు. క్రమశిక్షణ, ప్రార్థన, బోధనా విధానం... ప్రతి అంశం నాకు ఎంతో నచ్చింది. ప్రతి ఉపాధ్యాయుడూ కూడా ప్రతీ విద్యార్థిపట్ల ఎంతో శ్రద్ధ తీసుకొని బోధించేవారు.

స్వామి వివేకానంద బోధనలు ప్రతిరోజూ చదివేవాడిని. అవి నాకు మంత్రాలలాగ అనిపించేవి. Take the whole responsibility on your own shoulders... All power is within you, you can do anything and everything... ఇలా ప్రతీ సందేశం నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది. నా ముందు జీవితానికీ ఇప్పటి జీవితానకీ పోల్చి చూస్తే నాలో ఎంతో మార్పు వచ్చింది.

నేను తరగతులకు హాజరు అయ్యేటప్పుడు బస్సులో వస్తే ఆలస్యమై ఇన్స్టిట్యూట్ లోనికి అనుమతించరని తెలిసి రోజూ మౌలాలీ నుండి సైకిల్ మీద వచ్చి తరగతులకు హాజరయ్యేవాణ్ణి, మరలా ఇన్స్టిట్యూట్ నుండి ఎర్రగడ్డ (ఉద్యోగానికి) వెళ్ళేవాడిని. నాకు అసలు అలసటే అన్పించేది కాదు. ఈ విషయం తెలిసిన నా సహోద్యోగులు ఎవరూ నమ్మేవారు కాదు.

నేను ఇప్పుడు ఇంగ్లీష్ మీడియమ్ విద్యార్థుల కంటే బాగా ఇంగ్లీష్ మాట్లాడగలిగే సామర్థ్యం పొందగలిగాను.

నా జీవితం ఎటు వెళుతుందో అనుకొనే సమయంలో స్వామీజీ బోధలు నాకు ఎంతో స్ఫూర్తినిచ్చి మంచి మార్గాన్ని అనురించేలా చేశాయి. ఎందుకంటే హైదరాబాద్‌లో నాకు మంచి చెప్పే వారు ఎవరూ లేరు. నేను ఎలా ఉన్నా మందలించే వారు లేరు. నాలాంటి ఎంతో మంది యువకులకు స్వామీజీ సందేశం మహా మంత్రంగా పనిచేస్తుంది. శ్రీరామకృష్ణ ప్రభ పుస్తకం ముఖ్యంగా యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

స్వామి వివేకానందుని సందేశం మహా మంత్రంలా పనిచేసి నాలో మనోబలాన్ని పెంచింది. ప్రస్తుతం నేను నైట్ షిఫ్ట్స్ చేస్తూ I cet కోచింగ్‌కి వెళ్తున్నాను. స్వామీజీ ఆశీర్వాదంతో నేను ఎమ్.బి.ఎ. తప్పక పూర్తిచేయగలననే విశ్వాసం ఉంది.

Truth, purity, unselfishness- wherever these are present, there is no power below or above the sun to crush the possessor thereoff.

సత్యం, పవిత్రత, నిస్వార్థతలతో జీవించేవారిని ప్రపంచంలో ఏ శక్తీ ప్రతిఘటించలేదన్న స్వామి వివేకానందుని మహత్తర సందేశాన్ని ఒక మంత్రంగా స్వీకరించాను.

నీతీ నిజాయతీలతో జీవితాన్ని కొనసాగిస్తూ నాకు వీలైనంతలో ఇతరులకు సహాయపడతాను. మనసును వక్రమార్గంలోనికి వెళ్ళనివ్వకుండా స్వామీజీ బోధనలు సహాయపడతాయని అనుభవ పూర్వకంగా నేను గ్రహించాను. అందుకే నవతరం స్వామీజీ సాహిత్యాన్ని తప్పక చదవాలని కోరుతున్నాను. ❖

వి. శ్రీనివాస్, మౌలాలీ, హనుమాన్ నగర్, సికింద్రాబాద్

మహనీయుల జీవితాల్లో

మధురఘట్టాలు

–డా॥ కరిమద్దెల నరసింహా రెడ్డి

సమయస్ఫూర్తి

ప్రపంచ ప్రఖ్యాత భారతీయ తత్త్వవేత్త, భారత రాష్ట్రపతి అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఒకసారి ఒక విందులో పాల్గొన్నారు. ఆ విందుకు అగ్రశ్రేణి నాయకులెందరో హాజరయ్యారు. ఆ సందర్భంలో ఒక తెల్లజాతీయుడు జాత్యాహంకారంతో "రాధాకృష్ణన్‌గారూ! మేమందరం తెల్లగా ఉంటాం. మీ భారతీయులు రంగు తక్కువగా ఉంటారు. కారణమేమిటి" అని ప్రశ్నించాడు. అప్పుడు రాధాకృష్ణన్‌గారు "చూడండిసార్! ఒకసారి భగవంతుడు రొట్టెలు కాల్చుకోవాలనుకున్నాడు. సరిగ్గా అనుభవం లేకపోవడం వల్ల రొట్టె సరిగా కాలలేదు. తెల్లగా ఉండిపోయింది. దానిని ఎందుకు వ్యర్థం చేయాలని మీ తెల్లజాతివారిని తయారుచేశాడు. ఈసారి చాలా జాగ్రత్తగా రొట్టెను తెల్లగానూ కాకుండా నల్లగానూ అవకుండా తయారుచేశాడు. ఆ విధంగా భగవంతుడు మా భారతజాతిని సృష్టించాడు" అని సమయస్ఫూర్తిని ప్రదర్శించి ఆ జాత్యాహంకారికి చురకలు వేసి మెత్తగా వాతలు పెట్టాడు.

ఆ జాత్యాహంకారి అంతటితో ఆగక మరల "రాధాకృష్ణన్‌గారూ! మేము అందరము ఒకే రంగులో తెల్లగా ఉంటాం. మీ భారతీయులు కొందరు తెల్లగా ఉంటారు, కొందరు నల్లగా ఉంటారు, కొందరు చామనఛాయగా ఉంటారు, ఎందుకు" అన్నాడు. అప్పుడు రాధాకృష్ణన్‌గారు తడుముకోకుండా 'వినండి సార్! కారణం చెప్తాను, భగవంతుని సృష్టి చాలా విచిత్రమైంది. అది ఎవరికీ అర్థంకాదు. ఎందుకోగాని గాడిదలన్నిటినీ ఒకేరంగులో సృష్టించాడు. గుఱ్ఱాలన్నింటినీ రకరకాల రంగుల్లో సృష్టించాడు. మీది గాడిదల జాతి, మాది గుఱ్ఱాల జాతి" అని సమయస్ఫూర్తితో చెప్పి జాత్యాహంకారి నోరుమూయించాడు. ❖



కనువిప్పు

డాక్టర్ జాకీర్ హుస్సేన్ స్వతంత్ర భారతదేశ మూడవ రాష్ట్రపతి. ఆయన స్వయంగా జామియా మిలియా విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ఆయన ఉపకులపతిగా ఉన్న కాలంలో దుమ్ముకొట్టుకుని పాలిష్ చెయ్యని బూట్లతో రావద్దని విద్యార్థుల్ని మందలించారు. అయినా ఫలితం లేకపోయింది. ఒకరోజు జాకీర్ హుస్సేన్ విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం ముందు నిలబడ్డారు. ఆయన్ని చూసిన విద్యార్థులు తమకు చీవాట్లు పెట్టడానికే నిలబడి ఉన్నారని అనుకున్నారు. వారిలో మొదట వచ్చిన విద్యార్థిని చూచి "బాబూ! నీ బూట్లు మాసి, దుమ్ముకొట్టుకొని ఉన్నాయి. నీ కాలు చాపు బూట్లను శుభ్రంగా పాలిష్ చేస్తాను" అని చేతిలో పాలిష్, బ్రష్‌తో సిద్ధమయ్యారు. ఆ విద్యార్థీ అతని వెనుకనున్న విద్యార్థులూ ఊహించని ఆ సన్నివేశానికి సిగ్గుపడ్డారు. వెంటనే వారు ఆయనకు క్షమాపణ చెప్పినారు. ఇకపైన దుమ్ముతో మాసిపోయిన బూట్లతో విశ్వవిద్యాలయానికి రాము అని శపథం చేశారు. ఈ విధంగా జాకీర్ హుస్సేన్ విద్యార్థులకు కనువిప్పు కలిగించి శుభ్రతకు, క్రమశిక్షణకు అలవాటుపడేలా వారిని తీర్చిదిద్దారు. ❖

వ్యక్తిత్వ వికాసం

– స్వామి రంగనాథానంద

మనలో రెండు ప్రకృతి శక్తులు పనిచేస్తుంటాయి. ఒకటి బాహ్యప్రకృతి, రెండవది ఆంతరంగికప్రకృతి.

జీవనయానంలో శారీరక, మానసిక మార్పులు, ఎదుగుదల తద్వారా ఏర్పడిన బంధాలు అన్నీ బాహ్య ప్రకృతి యొక్క యాంత్రిక లక్షణాలు. ఆంతరంగిక ప్రకృతి అన్నప్పుడు మనలో నీతి నియమాలు, మంచిచెడుల విచక్షణా జ్ఞానంద్వారా సంస్కరించుకోవాలి. దీనినే సంస్కృతి లేక వ్యక్తిత్వ వికాసం అంటాం.

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః జ్ఞానవానపి ।
ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥

(భగవద్గీత–3.33)

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః... మనలోని ప్రకృతి మనల్ని ఏమి చెయ్యాలో, ఏమి చెయ్యకూడదో ఆదేశిస్తుంది. మనలోని ప్రకృతి, సహజంగా ఇంద్రియ జ్ఞాన వ్యవస్థతో కూడి ఎల్లప్పుడూ బాహ్యంగా వెళ్ళడానికి చూస్తుంటుంది. దానితో పాటు మనస్సు కూడా బాహ్యంగా వెళ్తుంటుంది. ఈ రకంగా జరుగుతున్నప్పుడు మనలో ఇంకొక ప్రకృతి ఉద్భవిస్తుంది. దానినే మనస్తత్త్వ శాస్త్రంలో 'వాసనలు' అని అంటారు. ఇవి మనసులోనే చేతన మనస్సుకు అడుగున అచేతన మనస్సులో ఉంటాయి. ఆ వాసనలు బయటకు వచ్చి నిన్నూ, నన్నే కాదు 'జ్ఞానవానపి' – జ్ఞానులను కూడా అవి లాగేస్తుంటాయి. ఏ శక్తులు మనల్ని ఇలా చేస్తున్నాయో వేదాంతం మనకు తెలియచేస్తుంది. "ఒకటి బాహ్యశక్తి మరొకటి ఆంతరికశక్తి". చాలామంది ఆంతరిక శక్తులను ఖాతరు చెయ్యరు. అందువల్లనే వారు జీవితంలో పతనమవుతారు. ఆంతరిక శక్తుల గురించి తెలుసుకొని ప్రవర్తిస్తే జీవితం సద్వినియోగం అవుతుంది.

ప్రకృతి శక్తులను నియంత్రించాలంటే వాటికి సరియైన శిక్షణ నివ్వాలి. అందుకు శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: 'బాహ్యశక్తులను వెనకకు మరల్చు (మోడ్ ఫిరయే దావ్)'. ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించడం ద్వారా అది సాధ్యమవుతుంది. అలా చేయాలంటే శాస్త్రాధ్యయనం అవసరం. జంతువులు ప్రకృతికి లోబడి జీవిస్తాయి. ప్రకృతిని అధిగమించే శక్తి మానవులకు మాత్రమే ఉంది.

చైతన్యం – జడ పదార్థాల కలయికే మనిషి. ప్రకృతి మనలో జడపదార్థాన్ని ఉంచింది. మనలో నుండి ప్రకటితమయ్యేది చైతన్యమే. ప్రకృతే ఉండి, చైతన్యమే లేకుంటే మనకేమీ కష్టం ఉండేది కాదు. చైతన్యం ఉండడం వల్లనే ప్రకృతికి మనం ఎదురు తిరుగుతున్నాం. నీతి, సంస్కృతి, నాగరకత అన్నీ కూడా ప్రకృతిని ఎదుర్కోవడం వల్లనే సంభవిస్తాయి. ఎల్లప్పుడూ మనలోని శుద్ధ చైతన్యాన్ని మనం ప్రకటించుకోవాలని చూస్తుంటాం. మానవుడు కేవలం జడంగానే ఉన్నట్లయితే ప్రకృతి మాయకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. ఒక్కొక్కసారి భగవన్మాయను తప్పించుకోవడం జ్ఞానికి కూడా దుస్సాధ్యమవుతుంది.

జ్ఞానినాం అపి చేతాంసి దేవీ భగవతీ హి సా
బలాదాకృష్య మోహాయ మహామాయా ప్రయచ్ఛతి

(దేవీమాహాత్మ్యం–1.155)

"జగన్మాత మహామాయగా ప్రపంచంలో ప్రకటితమయినప్పుడు అది జ్ఞానిని కూడా మాయలోకి లాగివేస్తుంది"అని దేవీమాహాత్మ్యంలో చెప్పబడింది. కాబట్టి మనం ఎప్పుడూ చాలా జాగ్రత్తగా ఉండాలి. బాహ్యప్రకృతిని జయించి అంతరంగిక శక్తిని తెలుసుకోవడమే నిజమైన వికాసం. ❖

సేకరణ : ఆర్. కృష్ణ

... 17వ పేజీ తరువాయి.

10 దైవ విగ్రహాలను విసిరి వేయగానే, సముద్రం వెంటనే శాంతించింది. ఏం ఆశ్చర్యం! మర్నాడు ఆలయంలో అర్చకులు దైవ విగ్రహాలు కనబడకపోవడంతో కంగారుపడిపోయారు. విగ్రహాలు లభించనేలేదు.

11 కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి... దైవ విగ్రహాలు కనపడకపోవడంతో తల్లడిల్లిపోయిన ఉడమలైయప్ప అనే భక్తుడు తరువాత, తాను క్రొత్తగా తయారుచేసిన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని తిరుచందూర్‌కు తీసుకువచ్చాడు. అప్పుడు అతడికి కలలో సుబ్రహ్మణ్య స్వామి కనిపించి...

12 వెంటనే, నిద్రమేల్కొన్న ఉడమలైయప్ప కొంత మంది భక్తులతో సముద్రం వద్దకు వెళ్ళి విగ్రహాల కోసం వెతికాడు.



భక్తులు సముద్రంలో దూకి విగ్రహాలను బయటకు తీసుకువచ్చారు.

13 రాజు సమక్షంలో విగ్రహాలను మళ్ళీ ఆలయంలో ప్రతిష్ఠించారు.



ఉడమలైయప్ప తయారుచేసిన శిలావిగ్రహం పాలయంకొట్టై త్రిపురాంతీశ్వర ఆలయంలో నేటికీ వెలసి ఉంది.

14 వీరపాండ్య కట్టబ్రహ్మనకి సుబ్రహ్మణ్యస్వామి పట్ల అమిత భక్తి.

15

విశిష్టసేవా దినోత్సవం నాడు తాను నిర్మించిన రాతి మండపంలోకి సుబ్రహ్మణ్యస్వామిని ఆహ్వానించడానికి తమలపాకులు, వక్కలు మొదలైన వాటితో కట్టబ్రహ్మన వేచి ఉన్నాడు. దేవుణ్ణి చిన్నరథం(చప్పరం)లో కూర్చోబెట్టడానికి భక్తులు ప్రయత్నించారు. కానీ ఆయన కించిత్తు కూడా కదలలేదు. వేరే దారిలేక కట్టబ్రహ్మన వడమలైయప్ప మండపంలో ఉంచడానికి అంగీకరించాడు. వెంటనే సుబ్రహ్మణ్యస్వామి కదిలి చిన్న రథం(చప్పరం)లో ఆసీనులైనాడు.

16

సుబ్రహ్మణ్యస్వామి ఊరేగింపుగా వస్తున్నప్పుడు కట్టబ్రహ్మన మనస్సు మార్చుకుని మళ్ళీ ఆయనను తన మండపంలో అమర్చాలనుకున్నాడు. ఏం ఆశ్చర్యం! మళ్ళీ రథంలోని విగ్రహాన్ని కదల్చలేకపోయారు. కట్టబ్రహ్మన తన పట్టుదల వదల్లేదు.



17

అప్పుడు హఠాత్తుగా కుంభవృష్టి ప్రారంభమయింది.



మనిషి సమర్పించే సంపదలను భగవంతుడు ఖాతరుచేస్తాడా? చేయడు. భక్తిని, ప్రేమను ఎవరు సమర్పిస్తారో అతడికి మాత్రమే భగవంతుని కృప లభిస్తుంది.

– భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస

గ్రంథ పరిచయం

శ్రీ భగవద్గీత



వ్యాఖ్యాత: భాగవతుల సుబ్రహ్మణ్యం
పేజీలు: 661 వెల: రూ. 200/-
ప్రతులకు: నవరత్న బుక్ హౌస్; 28-22-20, రహిమాన్ వీధి, అరండల్‌పేట, విజయవాడ- 520 002

వ్యాస మహర్షి వేదవిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులో ఉండేలాగ అందించాలని అన్ని వేదాల సారాన్నీ "మహాభారతం"లో ఇమిడ్చారు. ఉపనిషత్ సారాన్ని తీసి భగవద్గీతగా రూపొందించారు. సాక్షాత్తు భగవానుడే తన అవతార తత్త్వాన్ని అర్జునుని ద్వారా లోకానికి అందించాడు. గీత సర్వధర్మకర్మ మర్మాలను బోధించే ఉత్తమ గ్రంథం. భగవద్గీతను చదివినట్లైతే నిత్యజీవితంలో మనం ఎదుర్కొనే సవాళ్ళకూ, సమస్యలకూ సమాధానాలు దొరుకుతాయి. దీనిని అందరూ సులువుగా చదివి అర్థం చేసుకునేందుకు వీలుగా శ్రీ భాగవతుల సుబ్రహ్మణ్యంగారు సరళమైన తెలుగులో వ్యాఖ్యానించి అందించారు. వ్యాఖ్యాత తమదైన శైలిలో చేసిన ఈ వ్యాఖ్యానం అందరికీ ఉపయోగపడుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రతీ అధ్యాయం చివరనా దాని మహాత్మ్యాన్ని వివరించే ఇతిహాసాన్ని క్లుప్తంగా ఇచ్చారు. ప్రతి ఒక్కరూ చదివి, చదివించాల్సిన గొప్ప గ్రంథం ఇది. ❖ - శ్రీమతి ఎన్. శేషు

దైవ భైషజ్యము

గ్రంథకర్త: మహర్షి పెద్దశ్యాలన్న
పేజీలు: 176, వెల: 175/-
సంకలనకర్త: కపిలవాయి లింగమూర్తి
ప్రతులకు: కె. ప్రభాకర్ వర్ధన్, ఎల్.ఐ.జి.331, ఎ.పి. హౌసింగ్ బోర్డ్ కాలనీ, గద్వాల - 509 125

భగవంతుడు భక్తులకు కల్ప వృక్షము వంటి వాడని శ్రీరామకృష్ణుల ఉవాచ. దృష్టిననుసరించి భగవంతుని నామ రూపాలు మారుతూ ఉంటాయి. అటువంటి భగవంతుడు పెద్ద శ్యాలన్న గారికి భిషక్కుగా కనిపించటం విశేషం. దేవుడే సంసార సాగరాన్ని దాటించే నావికుడని, భవరోగాన్ని హరించే వైద్యుడని భక్తుల నమ్మకం గదా! శ్యాలన్న గారు రామ నామం ఎలా సర్వ రోగ హరమో చెప్తూ నామం గురించి, నామ మహిమ గురించి, మానసిక శక్తి ద్వారా రోగ నివారణ గురించి, వివరిస్తూ ఆధ్యాత్మిక శక్తులు, జప, ధ్యానాల ద్వారా మానసిక, బాహ్య వ్యాధులెలా నివారించ వచ్చో చక్కగా తెలియచేశారు. ❖ - ఎం.వి. నాగప్రసాద్

శ్రీ మదరల్లకట్ట శ్రీ భ్రమరాంబా మల్లేశ్వరశతకము



తెలుగుసేత : పులవర్తి నూకాలరావు
పేజీలు: 80, వెల : రూ. 30/-
ప్రతులకు : శ్రీ పులపర్తి నూకాలరావు, 23-2-10, శ్రీ పూర్ణ సత్యాంబికా విహార్, వెంపటివారి వీధి, కాకినాడ-533 001.

ఓంకార తత్త్వము

సంకలనకర్త : తోటపల్లి బాలకృష్ణ శర్మ
పేజీలు: 224, వెల : రూ. 111/-
ప్రతులకు : తోటపల్లి బాలకృష్ణ శర్మ ఇ.నెం. 8-14-47, మజీద్ రోడ్, వనపర్తి, పాలమూరు జిల్లా -509 103.

భాస్కర శతకము



పండిత పరిష్కృతము
పేజీలు: 40, వెల : రూ. 15/-
ప్రతులకు : భరణి పబ్లికేషన్స్ ఇంటి నెం. 28-20-17/4, జానీ వీధి, అరండల్‌పేట, విజయవాడ - 520 002

హరిఃఓమ్



రచయిత : మహ్మద్ అబ్దుల్ అజీజ్
పేజీలు: 120, వెల : రూ. 30/-
ప్రతులకు : మహ్మద్ ఫాతిమా అజీజ్ 15-7-12, సంతోషిమాత దేవస్థానం వీధి, నిదానందొడ్డి, అనకాపల్లి - 531 002

బ్రహ్మర్షి దైవరాత

రచన : రావినూతల శ్రీరాములు
పేజీలు: 48, వెల : రూ. 20/-
ప్రతులకు : శ్రీ రావినూతల శ్రీరాములు, రమణస్థాన్ 10/228, వసంతపురి కాలనీ, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047

దయాశతకమ్

సమర్పణ : శారదాకుమార్
పేజీలు: 126, వెల : రూ. 45/-
ప్రతులకు : శ్రీమతి ఎన్. విజయలక్ష్మి, శారదావిహార్, 24/589, రాజాగారి ప్లాట్స్, మూలాపేట, నెల్లూరు - 524 003

స్వామి సర్వగతానందజీ మహారాజ్ మహాసమాధి

శ్రీమత్ స్వామి సర్వగతానందజీ మహారాజ్ బోస్టన్ (యు.ఎస్.ఏ.) రామకృష్ణ వేదాంత సొసైటీలో 2009 మే 3వ తేదీ ఉదయం 5.30 గంటలకు మహాసమాధి పొందారు. స్వామీజీ వయస్సు 96 ఏళ్ళు. పూజ్య స్వామీజీ తూర్పు గోదావరి జిల్లాలోని ముమ్మిడివరం గ్రామంలో 1912వ సంవత్సరంలో జన్మించారు. స్వామీజీ పూర్వాశ్రమ నామం నారాయణ.

భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి అఖండానందజీ మహారాజ్ ఆదేశం మేరకు 1934 డిసెంబర్ 3వ తేదీన ముంబాయి నుంచి కాలినడకన బయలుదేరి 1935 ఫిబ్రవరి 7వ తేదీన హరిద్వార్ వెళ్ళి అక్కడ కంఖల్ రామకృష్ణ మిషన్ కేంద్రంలో బ్రహ్మచారిగా చేరారు. 1936వ సంవత్సరంలో స్వామి అఖండానందజీ మహారాజ్ వారి వద్ద నుంచి మంత్రదీక్షనూ, 1944లో మాతృమూర్తి శ్రీశారదాదేవి శిష్యులైన స్వామి విరజానందజీ మహారాజ్ నుంచి సన్న్యాస దీక్షనూ స్వీకరించారు.

పూజ్య స్వామీజీ కంఖల్, కరాచీ, విశాఖపట్నం మిషన్ కేంద్రాలలో ఎనలేని సేవలందించారు. 1954లో స్వామి అఖిలానందజీ మహారాజ్ సహాయకునిగా బోస్టన్ వెళ్ళి అక్కడ రామకృష్ణ వేదాంత సొసైటీలో తమ సేవలను కొనసాగించారు. 1962 నుంచి 2001 వరకు బోస్టన్ కేంద్ర అధ్యక్షులుగా రామకృష్ణ వివేకానంద వేదాంత ప్రచారానికి అవిశ్రాంతంగా కృషి చేశారు. క్రియాశీల కార్యకలాపాల నుంచి వైదొలగినప్పటికీ పరితప్తులైన భక్తులకు సాంత్వన చేకూర్చుతూ, జీవిత పర్యంతం ఆధ్యాత్మికంగా వారికి మార్గదర్శకత్వం వహిస్తూ వచ్చారు.

పూజ్య స్వామీజీ తపోమయ, ప్రేమమయ ఆధ్యాత్మిక అనుభూతులతో కూడిన జీవితం ఎంతో మంది భక్తులకు స్ఫూర్తిప్రదాయకంగా విరాజిల్లినదనడం అతిశయోక్తి కాదు. ❖

వార్తావాహిని

అగ్నిప్రమాద బాధితులకు సహాయం

తూర్పుగోదావరి జిల్లా, రాజఒమ్మంగి గిరిజన ప్రాంతంలో 2009 ఏప్రిల్ 1న సంభవించిన అగ్నిప్రమాదంలో 103 కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. **రాజమండ్రి రామకృష్ణ మిషన్** అగ్నిప్రమాద బాధితులకు లక్ష రూపాయల విలువచేసే దుప్పట్లు, చీరలు, లుంగీలు, బనియన్‌లు, తువ్వాళ్ళు, ప్లాస్టిక్ చాపలు, వంట పాత్రలు పంపిణీ చేసింది. ❖

నివేదిక : స్వామి అక్షరాత్మానంద

స్వామీజీ స్మారక చిహ్నం

స్వామి వివేకానంద పరివ్రాజక సన్న్యాసిగా భారతదేశమంతా సంచరిస్తూ 1892లో బెంగుళూరు సందర్శించారు. అప్పుడు స్వామీజీ కొద్ది రోజులపాటు కాలప్ప సత్రంలో బస చేశారు. ఆ సమయంలో సుగప్ప అనే నగల వ్యాపారి ఇంటి గోడకి అమర్చి ఉన్న రాతి బల్లపై స్వామీజీ పలుమార్లు విశ్రమించారు. ఆ రాతి బల్లపై విశ్రమించిన యువ సన్న్యాసి కాలాంతరంలో విశ్వవిజేత స్వామి వివేకానంద అని వారికి తెలిసింది. స్వామీజీ స్పర్శచే పావనమైన ఆ రాతి బల్లను సుగప్ప కుటుంబీకులు 1997 జనవరిలో బెంగుళూరు రామకృష్ణ మఠానికి అప్పగించారు. ఇటీవల మఠ ప్రాంగణంలో స్వామీజీ స్మృతి చిహ్నంగా ఓ మండపం నిర్మించడం జరిగింది. అందులో ఆ రాతి బల్లను పదిలపరచి దానిపై స్వామి వివేకానంద విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ❖

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము

యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.

వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య

స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము

యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.

వయస్సు : 15 సం॥, ఆ పైన

స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము - వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)

కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము

అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము

అనుభవము : 2 సంవత్సరములు

సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)

విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత

అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము

అనుభవార్హత : 5 సం॥

సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను **శ్రీ పి. వేంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 - 10 - 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020** (ఫోను: 040 - 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/-

హైదరాబాద్ కులప్రశాసకుడు

Sponsored by:

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020 and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**